

జై భీమ

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem STRUGGLE FOR JUSTICE TV

సామాన్యుడి ఆయుధంగా



సంపుటి - 07 | సంచిక 335 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 06, నవంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

బహిరంగ సవాల్‌పై.. బదులెక్కడ ?

ప్రధాని మోదీకి రాహుల్‌గాంధీ విసిరిన బహిరంగ సవాల్‌పై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. 12 ఏళ్ల కేంద్ర పాలనపై బహిరంగంగా చర్చించేందుకు సిద్ధమంటూ రాహుల్‌గాంధీ ఆహ్వానించారు. మోదీ విదేశీ పర్యటనలు, వాటి ఖర్చులు, దేశానికి చేకూరిన ప్రయోజనాలపై స్పష్టత ఇవ్వాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రజాధనం ఖర్చు చేసినప్పుడు దాని ఫలితాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం చెప్పడం ప్రజాస్వామ్య పాలనలో కీలకమైన అంశం. ఇదే సమయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారని డాక్టర్ బరిగెల శివ అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బహిరంగ సవాళ్లు, రాజకీయ విమర్శలకంటే ప్రజలకు అందే పాలనా ఫలితాలే అంతిమంగా ముఖ్యమని స్పష్టం చేశారు.

- హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2

రాహుల్ గాంధీ సవాల్‌ను స్వీకరించని ప్రధాని మోడీ



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



ప్రధాని మోడీ విదేశీ టూర్లపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి

మోడీ 12 సంవత్సరాల టూర్లపై సవాల్ విసిరిన రాహుల్ గాంధీ

దేశ పాలనపై చర్చించేందుకు సిద్ధమంటూ ప్రధానమంత్రిని ఆహ్వానించారు

విదేశీ టూర్లపై చేసిన ఖర్చు దేశానికి జరిగిన ఉపయోగాలపై చర్చ జరగాల్సిందే

దేశ ప్రజల సొమ్ము దుర్వినియోగంపై ప్రతి ఒక్కరు స్పందించాలి

బిజెపి పార్టీ నిజాయితీని నిరూపించుకోవడానికి ఇదొక మంచి అవకాశం

రాహుల్ గాంధీ సవాల్ ను స్వీకరించి ప్రధాని మోడీ చర్చకు రావాలని కోరనైనది

పాలన వ్యతిరేక ప్రచారాలపై నిజాయితీని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఎవరిది

నిజాయితీగా పాలించినప్పుడు బహిరంగ సవాల్‌ను స్వీకరించాల్సిందే : డాక్టర్ బరిగెల శివ

ఓటర్ల జాబితాలో పేరు లేకున్నా మళ్లీ అవకాశం

ఫారం-6 ద్వారా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు

ఎస్ఐఆర్ తర్వాత పేర్లు లేని వారికి ఈసీ వెసులుబాటు

గతంలో ఓటరుగా నమోదైన వారికీ అవకాశం

ఫారం-6 దరఖాస్తుతో చట్టపరమైన చర్యలు ఉండవు

మరో నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండకూడదు



7

ప్రవళిక మృతితో ఆర్టీసీ కీలక నిర్ణయం.. డోర్లు మూస్తేనే బస్సు ముందుకు!

ప్రవళిక మృతితో అన్ని బస్సులకు డోర్లు తప్పనిసరి చేసిన ఆర్టీసీ

డోర్లు మూసిన తర్వాతే బస్సులు కదలాలని ఆదేశాలు

డోర్లు లేని బస్సులకు వెంటనే తలుపులు ఏర్పాటు చేయాలని సూచన

టికెట్ వివాదంలో ప్రయాణికురాలు నెట్టడంతో ప్రవళికకు తీవ్ర గాయాలు

చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన మహిళా కండక్టర్



2

మెట్రో-ఆర్టీసీ కామన్ పాస్ ధరలు తగ్గింపు!

రోజువారీ పాస్‌పై రూ.75 తగ్గింపు

నెలవారీ పాస్ ధర సగానికి తగ్గింపు

రూ.4,000-4,500కు నెలవారీ పాస్

ప్రయాణికుల ఫీడ్‌బ్యాక్‌తో నిర్ణయం

దీపావళి నుంచి కొత్త ధరలు?



2

రాహుల్ ర్యాలీకి గైర్హాజరు..

200 మంది యూత్ కాంగ్రెస్ నేతలపై వేటు!

మేనమామ పెద్దకర్మకు వెళ్లినా సస్పెన్షన్

రోహిత్ రజోరియా ఆవేదన

బార్‌కోడ్, యాప్‌తో హాజరు నమోదు

తెలంగాణలో 14 మందిపై చర్యలు

క్రమశిక్షణ కోసమేనన్న అధ్యక్షుడు

5



జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్

ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు



కాకినాడ, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్):

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ గురువారం కరపలోని పి.ఎం.ఎస్.ఎన్.ఎస్.ఎం. జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రం పరిసరాలు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పోలీసు సిబ్బంది మోహరింపును తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల విధులను అప్రమత్తతతో, బాధ్యతాయుతంగా నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో జనసమూహాలు గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లకు సురక్షితంగా తరలించే వరకు పూర్తి జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు.ఓటర్లు ఎలాంటి ఒత్తిళ్లకు, భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా భద్రత కల్పించాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ తనిఖీల్లో ఎస్డీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎన్. రమేష్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రజా హక్కుల కోసం నల్ల నర్సింహులు చేసిన పోరాటం మరువలేనిది!

33వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు..
నాటి సాయుధ పోరాట చరిత్రను గుర్తుచేసుకున్న నాయకులు
నేటి యువత నల్ల నర్సింహులు ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి
బీసీ, పద్మశాలి సంఘం నాయకులు



నల్లబెల్లి, నవంబర్ 5, 2026 (జై భీమ్ న్యూస్)

తెలంగాణలో నిజాం పాలన, రజాకార్ల అరాచకాలు, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నల్ల నర్సింహులు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, త్యాగాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని బీసీ హక్కుల సాధన సమితి, పద్మశాలి సంఘం నాయకులు కడియాల క్రాంతి కుమార్, బొద్దుల దశరథం, బోగ భద్రయ్య, బొద్దుల నర్సయ్య, క్యాతం మొగిళి అన్నారు.మండల కేంద్రంలోని నల్లబెల్లి బస్టాండ్ ఆవరణలో నల్ల నర్సింహులు 33వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఒకప్పుడు బానిసత్వం, వెట్టిచాకిరీ, భూస్వాముల దోపిడీతో అణచివేతకు గురైన తెలంగాణ సమాజంలో ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో రైతాంగ సాయుధ పోరాటం కీలక పాత్ర పోషించిందన్నారు. ఆ పోరాటాల ఫలితంగానే పేదలకు భూములు దక్కాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లో ఆత్మగౌరవ భావన బలపడిందని పేర్కొన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయుడిగా జనగామ తాలూకాలోని కొడకండ్లలో తన జీవితాన్ని ప్రారంభించిన నల్ల నర్సింహులు, విసునూరు రామచంద్రారెడ్డి దొర అరాచకాలను, భూస్వామ్య దోపిడీని ఎదిరించేందుకు కమ్యూనిస్టు పార్టీలో చేరి సాయుధ దళాల్లో పనిచేశారని గుర్తుచేశారు. ప్రజల హక్కులు, భూమి కోసం సాగిన పోరాటంలో ఆయన కీలకంగా వ్యవహరించారని తెలిపారు.సాయుధ పోరాటం అనంతరం లక్ష్మక్కపేటలో సైన్యం చేతికి చిక్కి పోలీసులకు అప్పగించబడిన నల్ల నర్సింహులుకు స్థానిక కోర్టు ఉరిశిక్ష విధించిందని, అయితే హైకోర్టులో అప్పీలు చేసుకోవడంతో పాటు తన కేసును తానే వాదించి న్యాయపోరాటంలో విజయం సాధించారని నాయకులు వివరించారు.అణచివేతకు తలవంచకుండా ప్రజల హక్కుల కోసం పోరాడిన నల్ల నర్సింహులు జీవితం, ఆయన పోరాట పటిమ, ధైర్యం నేటి తరానికి ఆదర్శంగా నిలవాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పల్లికొండ రవి, వైనాల వీరాస్వామి, ఆకుల సాంబరావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సవాల్‌పై బదులెక్కడ

రాహుల్ గాంధీ సవాల్ ను స్వీకరించని ప్రధాని మోడీ
ప్రధాని మోడీ విదేశీ టూర్లపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి
మోడీ 12 సంవత్సరాల టూర్లపై సవాల్ విసిరిన రాహుల్ గాంధీ
దేశ పాలనపై చర్చించేందుకు సిద్ధమంటూ ప్రధానమంత్రిని ఆహ్వానించారు
విదేశీ టూర్లపై చేసిన ఖర్చు దేశానికి జరిగిన ఉపయోగాలపై చర్చ జరగాల్సిందే
దేశ ప్రజల సొమ్ము దుర్వినియోగంపై ప్రతి ఒక్కరు స్పందించాలి
బిజెపి పార్టీ నిజాయితీని నిరూపించుకోవడానికి ఇదొక మంచి అవకాశం
రాహుల్ గాంధీ సవాల్ ను స్వీకరించి ప్రధాని మోడీ చర్చకు రావాలని కోరనైనది
పాలన వ్యతిరేక ప్రచారాలపై నిజాయితీని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఎవరిది
నిజాయితీగా పాలించినప్పుడు బహిరంగ సవాల్ ను స్వీకరించాల్సిందే : డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

దేశ రాజకీయ పాలన ప్రభావం ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని డాక్టర్ బరిగెల శివ అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడి 12 సంవత్సరాలుగా విదేశాల పర్యటనలు చేస్తూ దేశానికి ఉపయోగకరమైన ఒప్పందాలు కుదుర్చుకున్నామని నరేంద్ర మోడీ పలుమార్లు దేశ ప్రజలకు తెలియజేస్తుండగా ప్రధాని విదేశీ పర్యటనలపై పలువురు మేధావులు ప్రతిపక్షాలు అదే రీతిలో విమర్శలు కురిపిస్తూ దేశ ప్రజల సొమ్మును విదేశీ టూర్ల పేరు మీద ఖర్చు చేసిన మోడీ దేశ ప్రజలకు దేశానికి చేసిన మేలు ఏమిటో శ్వేతపత్రం రూపంలో విడుదల చేయాలని దేశవ్యాప్తంగా పలువురు రాజకీయ విశ్లేషకులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి టూర్ కు సంబంధించిన షెడ్యూల్ ను బహిరంగంగా ప్రకటించిన దేశ ప్రధాని ఆయా దేశాలతో చేసుకున్న వ్యాపారపరమైన ఒప్పందాలను అభివృద్ధిని దేశానికి తీసుకువచ్చిన లావాదేవీల సొమ్మును దేశ ప్రజలకు తెలియడానికి ఎందుకు జంకుతున్నాడంటూ సూటిగా నిలదీశారు. ప్రజల సొమ్మును పరిపాలనలో భాగంగా ఖర్చు చేసినప్పుడు ఖర్చు చేసిన సొమ్ము గాను ఫలితాలను తెలియజేయడానికి రహస్యం ఎందుకు అంటూ నిలదీశారు. 12 సంవత్సరాల పాలనపై ఏఐసీసీ ప్రధాన నేత రాహుల్ గాంధీ దేశ ప్రధాని నరేంద్ర మోడీకి బహిరంగ సవాల్ చేసినప్పుడు అట్టి సవాల్ ను స్వీకరించి 12 సంవత్సరాలుగా బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలకు చేసిన అభివృద్ధిని చర్చించడానికి సహృదయ భావంతో ముందుకు రావాల్సిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రజాక్షేత్రం వేదికను అంగీకరించకపోవడం దేశ పాలనపై దేశ ప్రజలకున్న అనుమానాలను మరింతగా బలపరుస్తున్నట్లు ఉందన్నారు. మట్టుకైతే రాజకీయ నాయకుల మధ్య సవాళ్లు ప్రతి సవాళ్లు సహజంగా జరిగేవెనని అలాంటిది ప్రభుత్వంపై ప్రతిపక్షాలు సవాలుతో కూడిన అనుమానాలను వ్యక్తం చేయడం సర్వసాధారణమని వాటిని నిరూపించుకునే క్రమంలో ప్రభుత్వ పాలకులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ప్రతిపక్షాలకు నిర్దిష్టమైన సమాధానాలను చేరవేస్తూ బాధ్యతాయుతమైన జవాబుదారీతనాన్ని ప్రదర్శించాల్సి ఉండేనంటు గుర్తు చేశారు.

దేశంలో ఆమడ దూరాన అభివృద్ధి..

అధికార ప్రభుత్వం దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందంటూ విపరీతమైన ప్రచారాలు చేసుకుంటే ప్రతిపక్ష నేతలు ప్రతిపక్ష రాజకీయ పార్టీలు బిజెపి ప్రభుత్వం ప్రజలను అభివృద్ధి పేరు మీద చిత్రహింసలు పెడుతుందని దేశాన్ని పాలించే హక్కు బిజెపికి లేదంటూ తీవ్రంగా విమర్శలకు గుప్పిస్తున్నారని అన్నారు. దేశంలో జరుగుతున్న అభివృద్ధి అంతా ఆర్థిక దోపిడేనంటు అవహేళన చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో చూసిన ఆర్థిక వనరుల కొలత స్పష్టంగా కానవస్తుందని అలాంటిది దేశ ప్రజలను మోసగిస్తూ అభివృద్ధి పరుస్తున్నామని తెలియజేయడం ఎంతవరకు సమంజసం అంటూ సూటిగా నిలదీశారు. దేశాన్ని పాలించే క్రమంలో ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ విదేశీ టూర్ లు చేయడం అనేది ఏ నాయకులు ఏ దేశ ప్రధానమంత్రి చేయలేదని స్పష్టంగా తెలుస్తుందన్నారు. దేశ ప్రధాని విదేశీ పర్యటనల కోసం ఉపయోగించిన విమానాలను వాటి సంస్థల ఆధారాలను ఏ ఏ దేశంలో ఏ రకమైన ఆర్థిక లావాదేవీల ఒప్పందాలు కుదుర్చుకున్నారో స్పష్టంగా వెల్లడించాల్సిన బాధ్యత దేశ ప్రధాని నరేంద్ర మోడీపై ఉందని గుర్తు చేశారు. ప్రతిపక్షాల విమర్శలకు సరైన సమాధానం చెప్పి తమ నిజాయితీని చాటుకోవాలని గుర్తు చేశారు. ప్రధానమంత్రి విదేశీ పర్యటనలలో భాగంగా దేశంలోని ఏ వ్యాపార రంగ సంస్థలకు మేలు చేశారో అది ఏ వ్యాపారవేత్తకు సంబంధించిన పరిశ్రమలో వివరాలు బయటకు రావాల్సి ఉందన్నారు.

దేశ రాజకీయాల్లో దూసుకుపోతున్న రేవంత్ రెడ్డి..

తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు సమయానుకూలంగా విపత్తు కాలాలను సృష్టిస్తున్నప్పటికీ తెలంగాణలో పరిపాలన మెరుగుపడకపోవడం బాధాకరమన్నారు.మంత్రులు శాసనసభ్యులు ప్రభుత్వ శాఖలలోని ఉన్నతాధికారులు ప్రభుత్వ పాలనకు సరైన విధంగా సహకరించకపోగా ప్రభుత్వాన్ని పలచన చేయడం కోసం ప్రజలను వేధిస్తున్నారని అన్నారు. అదే సందర్భంలో రాష్ట్రంలో ఆర్థిక వనరుల కొరత పెద్ద ఎత్తున ఏర్పడడం వల్ల సంక్షేమ పథకాలు అమలు పరచడంలో రాష్ట్ర ప్రభుత్వం అనుకున్న స్థాయిలో సంక్షేమ పథకాల అమలను చేయలేకపోతుందన్నారు. కొన్ని కటోరమైన నిర్ణయాల్లో మినహాయిస్తే తెలంగాణలో ప్రభుత్వ పాలన పక్క రాష్ట్రాలతో పోలిస్తే కాస్తంత మెరుగ్గానే ఉందని ఒప్పుకోక తప్పదు అన్నారు. ఈ మధ్యకాలంలో నిరుద్యోగులు రైతులు మహిళలు పేద ప్రజలు అభివృద్ధి పేరు మీద వెనుకబడి పోతున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తుండగా పాఠశాల విద్యాసంస్థను ఇంటర్ బోర్డు విద్యా సంస్థను అనుకున్న దానికన్నా ఎక్కువగా అభివృద్ధి పరచడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండడమే కాకుండా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంతో రాష్ట్రవ్యాప్తంగా కొత్త రకమైన అభివృద్ధిని చేపట్టి విద్యా విధానాన్ని సాంకేతిక పద్ధతిలో అభివృద్ధి చేయాలని దృఢమైన సంకల్పాన్ని బలపరుస్తుందన్నారు. మూడు సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ప్రజలు కాస్తంత ఇబ్బందికరంగా, నిరుత్సాహంగాను, ఉన్నప్పటికిని ఆర్థిక లావాదేవీల దృష్ట్యా రాష్ట్ర అభివృద్ధి అనుకున్న స్థాయిలో మెరుగుపడడం లేదనేది కొంతమేర కనిపిస్తున్నట్లుగా మేధావులు భావిస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా మత విద్వేషాలను రెచ్చగొట్టే పద్ధతిని ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే తెలంగాణ రాష్ట్రం కొంతమేర పరవాలేదు అనిపిస్తుంది అన్నారు. ఇదే సందర్భంలో దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని జాతీయ ఎన్నికల కమిషన్ ఆగడాలపై కేంద్ర ప్రభుత్వం దేశ పాలనలో రాజకీయ పాలన దుర్వినియోగానికి పాల్పడుతున్న విధానంపై దేశంలోని ప్రతిపక్ష హోదాలోని కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా చేపడుతున్న పోరాటాలు దేశ ప్రజలను కాంగ్రెస్ వైపు తిప్పుకోవడం కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయని ముఖ్యంగా దేశంలో జరుగుతున్న రాజకీయ పాలనపై జరుగుతున్న పోరాటాలలో రాహుల్ గాంధీతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణ అంటే కెసిఆర్..... కెసిఆర్ అంటే తెలంగాణ అనే పరిస్థితుల నుండి తెలంగాణలో కేసీఆర్ లాంటి రాజకీయ పండితుడిని ఓడించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రేవంత్ రెడ్డి దేశ రాజకీయాలను కాంగ్రెస్ వైపు తిప్పడం కోసం తీవ్రంగా కృషిస్తున్నాడని మాత్రం వాస్తవం అన్నారు. బిజెపి పార్టీ దేశ ప్రజలను ఏ విధంగా మోసగిస్తుందో దేశ రాజకీయాలను ఏ విధంగా భ్రష్ట పట్టిస్తుందో తెలంగాణ పోలీస్ శాఖ అత్యంత సూక్ష్మంగా పసివాడుతూ తెలంగాణ ఇంటెలిజెన్స్ విభాగం సమక్షంలో జాతీయ రాజకీయ పరిణామాలపై ఎప్పటికప్పుడు నివేదికలు సిద్ధపరచుకుంటూ జాతీయస్థాయిలోని రాజకీయాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధమైనటువంటి ప్రణాళికలు చేపట్టాలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రూపంలో ప్రతి అంశంపై ఏఐసీసీ కార్యవర్గం సుదీర్ఘమైన చర్చలు చేపడుతూ ముందుకు సాగుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారన్నారు. కేవలం ఆరు నెలల్లోనే దేశంలోని బిజెపి పార్టీకి సంబంధించిన రాజకీయ పలుకుబడిని ఉక్కిరిబిక్కిరి చేయగలిగినారంటే దాని వెనకాల కచ్చితంగా రేవంత్ రెడ్డి కృషి పెద్ద ఎత్తున ఉందని అందులో భాగంగానే ఈ మధ్యకాలంలో రాహుల్ గాంధీ పలు సందర్భాల్లో సీఎం రేవంత్ రెడ్డిని ఢిల్లీకి పిలిపించుకొని ఏఐసీసీ కార్యవర్గం సంబంధించిన సమావేశాల్లో ప్రత్యేకంగా పాల్గొనేలా చేయడం వల్ల జాతీయ రాజకీయాల్లో రేవంత్ రెడ్డిని క్రియాశీలకంగా వాడుకుంటున్నట్లు తెలుస్తుందన్నారు. జాతీయ రాజకీయాలలో గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడుతూ ఏ విధమైనటువంటి క్రియాశీలక పాత్ర పోషించారో అదే పద్ధతిలో సీఎం రేవంత్ రెడ్డి తనదైన శైలిలో కేంద్ర ప్రభుత్వ రాజకీయ పరిణామాలపై దూకుడు పెంచుతూ బిజెపి ప్రభుత్వాన్ని కేంద్రంలో గద్దెతించడం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని గుర్తుచేశారు. అదే సందర్భంలో రాష్ట్ర పాలనలో అభివృద్ధిని పెంచాలని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి మిగిలి ఉన్న రెండు సంవత్సరాల కాలాన్ని సద్వినియోగపరచుకొని ప్రజాప్రతినిధులను మంత్రులను ప్రభుత్వ ఉన్నతాధికారులను పరిగెత్తిస్తూ ప్రజాసేవ కోసం పని చేయించాలని తెలంగాణ రాష్ట్ర ప్రజల తరపున కోరుతున్నామన్నారు.

ప్రవళిక మృతితో ఆర్టీసీ కీలక నిర్ణయం..
డోర్లు మూస్తేనే బస్సు ముందుకు!

ప్రవళిక మృతితో అన్ని బస్సులకు డోర్లు తప్పనిసరి చేసిన ఆర్టీసీ
డోర్లు మూసిన తర్వాతే బస్సులు కదలాలని ఆదేశాలు
డోర్లు లేని బస్సులకు వెంటనే తలుపులు ఏర్పాటు చేయాలని సూచన
టికెట్ వివాదంలో ప్రయాణికురాలు నెట్టడంతో ప్రవళికకు తీవ్ర గాయాలు
చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన మహిళా కండక్టర్

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

మహిళా కండక్టర్ ప్రవళిక మృతి తెలంగాణ ఆర్టీసీలో కీలక మార్పుకు దారితీసింది. ప్రయాణికుల భద్రతతో పాటు సిబ్బంది రక్షణకు సంస్థ కొత్త నిబంధన తీసుకొచ్చింది. ఇకపై ఆర్టీసీ ఆధ్వర్యంలో నడిచే అన్ని బస్సులకు తప్పనిసరిగా డోర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. డోర్లు పూర్తిగా మూసిన తర్వాతే బస్సులు కదలాలని ఆదేశించింది. డోర్లు లేని బస్సులను గుర్తించి వెంటనే వాటిని అమర్చాలని అధికారులకు సూచించింది. ఆర్టీసీ పరిధిలోని అన్ని రకాల బస్సులకు ఈ నిబంధన వర్తించనుంది. ఇప్పటివరకు డోర్లు లేకుండా నడుస్తున్న బస్సులను గుర్తించి తక్షణమే తలుపులు ఏర్పాటు చేయాలని సంస్థ ఆదేశించింది. ఇకపై బస్సు బయలుదేరే ముందు డోర్లు మూసి ఉన్నాయో లేదో సిబ్బంది నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ప్రవళిక మృతి నేపథ్యంలో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మణుగూరు డిపోకు చెందిన మహిళా కండక్టర్ ప్రవళిక విధుల్లో ఉండగా టికెట్ విషయంలో ఓ మహిళా ప్రయాణికురాలితో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ప్రయాణికురాలు ఆమెను బస్సు నుంచి బయటకు నెట్టివేయడంతో ప్రవళిక కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆసుపత్రికి తరలించినా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ఆర్టీసీ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రవళిక కుటుంబాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వం, ఆర్టీసీ సంయుక్తంగా రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయనున్నట్లు తెలిపారు. ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీ ప్రత్యేక పాలసీ ద్వారా మరో రూ.కోటి ప్రమాద బీమా కూడా కుటుంబానికి అందనుంది.

మెట్రో-ఆర్టీసీ కామన్ పాస్ ధరలు తగ్గింపు!

రోజువారీ పాస్‌పై రూ.75 తగ్గింపు
నెలవారీ పాస్ ధర సగానికి తగ్గింపు
రూ.4,000-4,500కు నెలవారీ పాస్
ప్రయాణికుల ఫీడ్‌బ్యాక్‌తో నిర్ణయం
దీపావళి నుంచి కొత్త ధరలు?

హైదరాబాద్, నవంబర్ 06 (జై భీమ్ న్యూస్) :



నగర ప్రయాణికులకు ఊరట కల్పించేలా మెట్రో రైలు, ఆర్టీసీ కామన్ పాస్ ధరలను తగ్గించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రోజువారీ పాస్ ధర రూ. 400 ఉండగా, దాన్ని రూ. 325కు తగ్గించే అవకాశం ఉంది. నెలవారీ పాస్ ధరను రూ. 8,500 నుంచి రూ. 4,000--4,500 మధ్యకు తీసుకురావాలని అధికారులు ప్రతిపాదించినట్లు సమాచారం. అధిక ధరల కారణంగా ప్రయాణికుల నుంచి ఆశించిన స్పందన రాకపోవడంతో వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్ ప్రారంభంలో ప్రవేశపెట్టిన ఈ ఉమ్మడి పాస్‌తో ఔటర్ రింగ్ రోడ్ పరిధిలో మెట్రో రైళ్లు, పుష్పక్ ఏసీ సర్వీసులు మినహా ఆర్టీసీ సిటీ బస్సుల్లో అపరిమితంగా ప్రయాణించవచ్చు. ధరల సవరణపై మెట్రో, ఆర్టీసీ అధికారులు ఇప్పటికే చర్చలు జరపగా, ఉన్నతాధికారులతో తదుపరి సమావేశాల అనంతరం తుది నిర్ణయం వెలువడనుంది. సవరించిన ధరలు దీపావళి నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం. కొత్త ధరలతో కామన్ పాస్ వినియోగం పెరిగి ప్రజా రవాణాకు ప్రోత్సాహం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

తెలంగాణలో వాతావరణ విద్యకు సరికొత్త ముందడుగు



వచ్చే విద్యా సంవత్సరం నుంచి వాతావరణ మార్పులు, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక డిగ్రీ కోర్సు

హైద్రాబాద్, నవంబర్ 5(జై భీమ్ న్యూస్)

పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై యువతకు అవగాహన కల్పించడంతో పాటు నైపుణ్యవంతులైన భవిష్యత్ తరాన్ని తీర్చిదిద్దేందుకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో వాతావరణ మార్పులు, సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పాలన అంశాలపై ప్రత్యేక బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీ కోర్సును ప్రారంభించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఆరో విడత ప్రజల వాతావరణ కార్యాచరణ సదస్సును ఆయన ప్రారంభించారు. ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పుల చట్ర సదస్సు 31వ పక్షాల సమావేశానికి ముందస్తు సన్నాహక కార్యక్రమంగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, హరిత విప్లవ మండలి సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహించాయి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. ఇరవై ఒకటో శతాబ్దంలో పర్యావరణ పరిరక్షణ, సంరక్షణ, పునరుద్ధరణ అత్యంత కీలకమైన సవాళ్లుగా మారాయని పేర్కొన్నారు. వాతావరణ మార్పులు, భూతాపం, జీవవైవిధ్య క్షీణత, నీటి కొరత, కాలుష్యం, సహజ వనరుల తగ్గుదల వంటి సమస్యలు కేవలం పర్యావరణానికే పరిమితం కాకుండా సామాజిక, ఆర్థిక, అభివృద్ధి రంగాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వివరించారు. పర్యావరణానికి భౌగోళిక, రాజకీయ సరిహద్దులు ఉండవని, దాని పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. వ్యక్తుల స్థాయి నుంచి గ్రామాలు, స్థానిక సమాజాలు, రాష్ట్రాలు, దేశాలు, అంతర్జాతీయ స్థాయి వరకు సమన్వయంతో కూడిన సమష్టి కార్యాచరణ అవసరమని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కేవలం సామాజిక బాధ్యత మాత్రమే కాదని, రాజ్యాంగం నిర్దేశించిన ప్రతి పౌరుడి ప్రాథమిక విధి కూడా అని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడటంలో తమ బాధ్యతను గుర్తించి, పర్యావరణహిత జీవన విధానాలను నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణ సమస్యల పరిష్కారంలో ఉన్నత విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, వచ్చే విద్యా సంవత్సరం నుంచి వాతావరణ మార్పులు, సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పాలనపై ప్రత్యేక డిగ్రీ కోర్సును ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దేశంలోనే ఈ తరహా కోర్సును ప్రవేశపెట్టడం వినూత్నమైన, మార్గదర్శక విద్యా కార్యక్రమంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కోర్సు ద్వారా విద్యార్థులకు వాతావరణ మార్పులు, పర్యావరణ విధానాలు, సుస్థిర అభివృద్ధి సూత్రాలు, సహజ వనరుల నిర్వహణ, పర్యావరణ చట్టాలు, పర్యావరణ పరిపాలన వంటి కీలక అంశాలపై సమగ్ర పరిజ్ఞానం అందించనున్నట్లు తెలిపారు. అంతరశాస్త్రీయ అవగాహనతో పాటు ఆచరణాత్మక పరిజ్ఞానం, వృత్తిపరమైన నైపుణ్యాలను కూడా పెంపొందించనున్నట్లు వివరించారు. పర్యావరణ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే నైపుణ్యం కలిగిన యువతను తయారు చేయడం ఈ కోర్సు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కార్యాచరణ, సుస్థిర అభివృద్ధి రంగాల్లో యువత అర్థవంతమైన పాత్ర పోషించేందుకు ఈ విద్యా కార్యక్రమం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో హరిత విప్లవ మండలి ప్రతినిధులు, ప్రముఖ విద్యావేత్తలు, వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, పర్యావరణ నిపుణులు, పరిశోధకులు, విద్యార్థులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాయిని కుటుంబంపై వ్యక్తిగత విమర్శలు సరికాదు

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విజయభాస్కర్ వ్యాఖ్యలు..
డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



హనుమకొండ, 5 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై విజయభాస్కర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. అభివృద్ధి పనులపై నిర్మాణాత్మక విమర్శలు చేయకుండా వ్యక్తిగతంగా కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకోవడం రాజకీయ హుందాతనానికి విరుద్ధమని డివిజన్ ఇన్‌చార్జ్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు.హనుమకొండలోని వడ్డేపల్లి 60వ డివిజన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో పూర్తికాని అనేక అభివృద్ధి పనులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వేగవంతం చేశారని పేర్కొన్నారు. వరంగల్ నగరాన్ని వరద ముప్పు నుంచి కాపాడేందుకు నాలా బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో పాటు, వడ్డేపల్లి ప్రాంతంలో శ్మశానవాటిక నిర్మాణం, రైతుల భూములను గ్రీన్‌జోన్ నుంచి విముక్తి చేయించే చర్యలు, పేదలకు వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి నిర్మాణం వంటి పనులకు ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు.అర్హులైన పేదలకు పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ, రేషన్ కార్డుల మంజూరు వంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ముఖ్యంగా 58, 60వ డివిజన్ల పరిధిలో సుమారు రూ. 20 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, ముదిరాజ్ శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు, ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 50 లక్షల కేటాయింపు వంటి పనులు ఎమ్మెల్యే చొరవకు నిదర్శనమని అన్నారు. సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా కూడా అర్హులైన లబ్ధిదారులకు సహాయం అందిస్తున్నారని పేర్కొన్నారు.ఎమ్మెల్యే కుటుంబ సభ్యుడు విష్ణువర్ధన్ రెడ్డి సైతం యువత డ్రగ్స్, మద్యానికి దూరంగా ఉండాలనే లక్ష్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, 2కే, 5కే, 10కే, 20కే రన్‌ల ద్వారా యువతలో ఆరోగ్యంపై చైతన్యం కల్పించడం అభినందనీయమని రామకృష్ణ అన్నారు.ప్రజాస్వామ్యంలో రాజకీయ విమర్శలకు స్వాగతం ఉంటుందని, అయితే వ్యక్తిగత దూషణలకు, కుటుంబ సభ్యులను కించపరిచే వ్యాఖ్యలకు స్థానం లేదని స్పష్టం చేశారు. ప్రజలకు ఎవరు అభివృద్ధి కోసం పనిచేస్తున్నారో తెలుసని, అభివృద్ధి పనులపై చర్చించాలే తప్ప వ్యక్తిగత విమర్శలకు దిగకూడదని హితవు పలికారు. విజయభాస్కర్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని రాజకీయ హుందాతనాన్ని కాపాడాలని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ కోరారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ నాగరాజు, 58వ డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సుధాకర్, 60వ డివిజన్ అధ్యక్షుడు నవీన్, నాయకులు పున్నం, జనగం శ్రీనివాస్, కమల్, యుగేందర్, సాజిద్, కిషోర్, శ్రీకాంత్, మీనా, స్వప్న, ప్రసాద్, అక్మల్ తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట ఖజానా శాఖలో ఇద్దరు ఉద్యోగులపై కలెక్టర్ చర్యలు

లంచం డిమాండ్, ఉద్యోగుల వేధింపులపై ఫిర్యాదులు..
ఒకరిపై సస్పెన్షన్ వేటు, మరొకరికి బదిలీ

నర్సంపేట, 5 నవంబర్ 2026 (జై భీమ్ న్యూస్)



నర్సంపేట ఖజానా శాఖలో ఉద్యోగులపై వచ్చిన అవినీతి ఆరోపణలు, లంచం డిమాండ్, వేధింపుల ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్పందించారు. వరుసగా అందిన ఫిర్యాదులు, వాటిపై చేపట్టిన విచారణల నేపథ్యంలో ఇద్దరు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు.ఖజానా శాఖలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగులపై ఆరోపణలు రావడంతో కలెక్టర్ శాఖపరమైన చర్యలకు ఆదేశించినట్లు సమాచారం. ఇందులో భాగంగా చంద్రకళ అనే ఉద్యోగిని సస్పెండ్ చేయడంతో పాటు, అలేఖ్య అనే మరో ఉద్యోగిని బదిలీ చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాల్సిన ఉద్యోగులపై లంచం డిమాండ్, వేధింపుల ఆరోపణలు రావడం తీవ్ర చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా ఖజానా శాఖకు సంబంధించిన పనుల కోసం వచ్చే ఉద్యోగులు, ఇతర వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఫిర్యాదులు అధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది.అవినీతి ఆరోపణలపై ఫిర్యాదులు వచ్చినప్పుడు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవడం మంచి పరిణామమే అయినప్పటికీ, శాఖలో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, ఆరోపణల వాస్తవాలను వెలికితీయడంతో పాటు బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.ఖజానా శాఖలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ఉన్నతాధికారులు మరిన్ని చర్యలు తీసుకుంటారా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడికి కలెక్టర్ మర్యాదపూర్వక స్వాగతం

జాటోత్ హుస్సేన్ నాయక్‌ను కలిసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్):

జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎన్‌సీఎస్‌టీ) సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం వరంగల్‌లోని హరిత కాకతీయ హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కమిషన్ సభ్యులకు కలెక్టర్ పూల మొక్కను అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుమ, వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్ తదితర అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పట్ల చూపించాల్సింది జాలి కాదు.. ప్రేమ, చేయూత

మల్లికాంబ మనోవికాస కేంద్రం పిల్లలు తయారుచేసిన దీపావళి ప్రమిదల స్టాల్ ప్రారంభం



హనుమకొండ, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్):

దివ్యాంగుల పట్ల జాలి చూపడం కంటే ప్రేమ, ప్రోత్సాహం, చేయూత అందించడం ముఖ్యమని హనుమకొండ జిల్లా జడ్జి ఎం. సునీత, వరంగల్ జిల్లా జడ్జి నిర్మలా గీతాంబ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కోర్టు ప్రాంగణంలో మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన మానసిక దివ్యాంగులు, బధిర పిల్లలు తయారుచేసిన దీపావళి ప్రమిదల స్టాల్‌ను వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ దివ్యాంగుల్లోనూ అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని, తగిన ప్రోత్సాహం అందిస్తే వారి నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. పిల్లలు స్వయంగా తయారుచేసిన ప్రమిదలపై పెయింటింగ్, అలంకరణ వారి సృజనాత్మకతకు నిదర్శనమన్నారు. దివ్యాంగత్వం శరీరానికే తప్ప ప్రతిభకు కాదని, వారి సేవకు చేయూతనివ్వడం దైవసేవతో సమానమని తెలిపారు.దీపావళి సందర్భంగా ప్రజలు మార్కెట్‌లో ప్రమిదలు కొనుగోలు చేయడానికి బదులుగా ఈ పిల్లలు తయారుచేసిన ప్రమిదలను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు, న్యాయవాదులు పిల్లలు తయారుచేసిన ప్రమిదలను కొనుగోలు చేశారు.ఈ కార్యక్రమంలో ట్రిబ్యునల్ కోర్టు సభ్యురాలు, కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి, హనుమకొండ డీఎల్ఎస్ఏ కార్యదర్శి పూజిత, వరంగల్ డీఎల్ఎస్ఏ కార్యదర్శి పూజ, మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు రామలీల, కళ్యాణ్, న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
సమస్యలపై సమరంగా
POWER OF PEOPLE
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

ప్రశస్త్ 2.0పై ఒకరోజు జిల్లాస్థాయి శిక్షణ పూర్తి

పది రోజుల్లోగా దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలి: జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజు గౌడ్



హన్మకొండ, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్)

హనుమకొండ జిల్లాలో సమ్మిళిత విద్య వనరుల వ్యక్తులు, ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులకు ప్రశస్త్ 2.0 కార్యక్రమంపై ఒకరోజు జిల్లాస్థాయి శిక్షణ నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని సమ్మిళిత విద్య వనరుల వ్యక్తులు, ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజు గౌడ్ దృశ్య మాధ్యమం ద్వారా శిక్షణలో పాల్గొన్న వారిని ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలోని ప్రతి పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులను గుర్తించేందుకు నిర్వహించే ప్రాథమిక పరిశీలన పరీక్షలను రాబోయే పది రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పరీక్షల ద్వారా గుర్తించిన విద్యార్థులకు వారి అవసరాలకు అనుగుణంగా సహాయక పరికరాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దివ్యాంగ విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించడంలో సంబంధిత సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. జిల్లా సమ్మిళిత విద్య సమన్వయకర్త బి. మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థికి సంబంధించి 64 ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేసి మొదటి దశ పరిశీలన ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. అనంతరం రెండో దశ పరిశీలనను ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులు సంబంధిత పాఠశాలలను సందర్శించి పూర్తి చేయాలని వివరించారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాణ్యత సమన్వయకర్త డాక్టర్ బండారు మన్మోహన్, వనరుల వ్యక్తులు శ్రీధర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కాట్రపల్లిలో మహిళా సంఘ భవన నిర్మాణం చేపట్టాలి

కేసముద్రం, అక్టోబర్ 5 (జై భీమ్ న్యూస్)



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో శంకుస్థాపన చేసి నాలుగు నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని మహిళా సంఘ భవన నిర్మాణ పనులను తక్షణమే చేపట్టాలని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గడ్డం నాగార్జున మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మహిళా సంఘ భవనాలను మంజూరు చేయగా, అందులో భాగంగా కాట్రపల్లి గ్రామానికి కూడా భవనం మంజూరైందని తెలిపారు. సుమారు నాలుగు నెలల క్రితం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని అన్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్మాణ పనుల్లో పురోగతి లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల ఇతర గ్రామాల నుంచి సీసీలు, మహిళా సంఘాల నాయకులతో కలిసి ఏపీఎం కృష్ణమూర్తి కాట్రపల్లి గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారని తెలిపారు. గ్రామంలో మహిళా సంఘ భవనం లేకపోవడంతో మహిళలు పాఠశాల ఆవరణలో కటిక నేలపై కూర్చొని సమావేశం నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. మహిళా సంఘాల సమావేశాలకు సరైన వసతి లేకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధికి భవనాలు మంజూరు చేసినప్పటికీ, నిర్మాణ పనులు ప్రారంభించకపోవడం వల్ల మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామ పంచాయతీ ఆవరణలో శంకుస్థాపన చేసి వదిలేసిన మహిళా సంఘ భవన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు.

నిశ్చితార్థ వేడుకలో పాల్గొని నూతన జంటను ఆశీర్వదించిన రాజనాల శ్రీహరి



హనుమకొండ, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్):


వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని హంటర్ రోడ్ సాయినగర్ కాలనీకి చెందిన సర్వోత్తమం సోదరి జాబిల్లి రోహిత్ భార్గవ్ నిశ్చితార్థ వేడుకలో గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి పాల్గొని కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పోలేపాక ప్రసాద్, మాగంటి శివ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

నవంబర్ మూడో వారంలో ఇన్‌స్పైర్ అవార్డులు, బాల వైజ్ఞానిక ప్రదర్శనలు

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలి: జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డి

వరంగల్, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్)

వరంగల్ జిల్లాలో విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం, సృజనాత్మకత, నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో ఇన్‌స్పైర్ అవార్డులు – మానక్ 2025-26, రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన 2026-27 జిల్లా స్థాయి ప్రదర్శనలను నవంబర్ మూడో వారంలో నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేపట్టింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. ఇన్‌స్పైర్ అవార్డులు -- మానక్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లాలో ఎంపికైన 144 మంది విద్యార్థులు జిల్లా స్థాయి ప్రదర్శనలు, ప్రాజెక్టుల పోటీల్లో తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. జాతీయ నూతన ఆవిష్కరణల సంస్థ ద్వారా ఎంపికైన ప్రతి విద్యార్థి ఖాతాలో ప్రాజెక్టు అభివృద్ధి కోసం ఇప్పటికే రూ.10 వేల చొప్పున జమ చేసినట్లు వెల్లడించారు. విద్యార్థులు ఈ మొత్తాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆలోచనలను వినూత్న ప్రాజెక్టులు, పనిచేసే నమూనాల రూపంలో అభివృద్ధి చేయాలని, మార్గదర్శక ఉపాధ్యాయులు అవసరమైన సాంకేతిక సహకారం, సూచనలు అందించాలని కోరారు. సమాజానికి ఉపయోగపడే, తక్కువ ఖర్చుతో రూపొందించగలిగే, నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలు చూపించే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా రాష్ట్రస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన 2026--27కు సంబంధించి జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి నిర్దేశించిన 'సుస్థిరమైన, అభివృద్ధి చెందిన భారతదేశం కోసం విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, నూతన ఆవిష్కరణలు' అనే ప్రధాన



అంశంపై విద్యార్థులు వినూత్న నమూనాలు, ప్రదర్శనలు రూపొందించాలని తెలిపారు. ఇందులో మెరుగైన జీవనం కోసం కృత్రిమ మేధస్సు, హరిత ఇంధనం -- పర్యావరణ పరిరక్షణ, గణిత నమూనాలు -- గణనాత్మక ఆలోచనా విధానం, ఆరోగ్యం -- పరిశుభ్రత -- పారిశుద్ధ్యం, స్థానిక వ్యవసాయ పద్ధతులు, గ్రామీణ పరివర్తన కోసం విజ్ఞానశాస్త్రం, విపత్తుల నిర్వహణ వంటి ఏడు ఉప అంశాలను ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ పోటీలను ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు జూనియర్ల విభాగంలో, తొమ్మిది నుంచి పన్నెండో తరగతి వరకు సీనియర్ల విభాగంలో నిర్వహించనున్నారు. ప్రతి ప్రదర్శనకు ఒక విద్యార్థి మాత్రమే పాల్గొనాల్సి ఉంటుందని, ప్రతి ఉప అంశంలో రెండు విభాగాల నుంచి అత్యుత్తమ ప్రదర్శనలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనల్లో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ శిక్షణార్థులకు కూడా ప్రత్యేక అవకాశాలు కల్పించనున్నారు. ఉపాధ్యాయుల కోసం వినూత్న బోధన, అభ్యసన సామగ్రి తయారీ విభాగం, ఉపాధ్యాయ శిక్షణ కోర్సులు చదువుతున్న విద్యార్థుల కోసం వినూత్న బోధన, అభ్యసన సామగ్రి తయారీ విభాగాల్లో ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఈ విభాగాల్లో ఉత్తమ ఉపాధ్యాయ ప్రదర్శనతో పాటు ఉత్తమ శిక్షణార్థి ప్రదర్శనను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. అలాగే బాల వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా వాతావరణ మార్పుల నివారణకు విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, ఇంజినీరింగ్, గణితం వినియోగం, అంటువ్యాధులు కాని వ్యాధులకు కారణాలు, నివారణ చర్యలు అనే అంశాలపై ఒకరోజు సదస్సు నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన విద్యార్థికి రాష్ట్రస్థాయి సదస్సులో పాల్గొనే అవకాశం కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎంపికైన విద్యార్థుల ప్రాజెక్టుల తయారీని వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని, విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయులు విద్యార్థుల ఆలోచనలను ఆచరణాత్మక నమూనాలుగా రూపొందించేందుకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి సూచించారు. పాఠశాలల్లో అందుబాటులో ఉన్న ప్రయోగశాలలు, పరికరాలు, ఇతర వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రాజెక్టుల వివరణ, ప్రదర్శన, ప్రయోగాత్మక నైపుణ్యాలపై విద్యార్థులకు తగిన శిక్షణ ఇవ్వాలని తెలిపారు. మార్కెట్‌లో సిద్ధంగా లభించే నమూనాలను కొనుగోలు చేసి ప్రదర్శించకుండా విద్యార్థుల సొంత ఆలోచనలు, సృజనాత్మకతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. మండల విద్యాధికారులు, పాఠశాలల సముదాయ ప్రధానోపాధ్యాయులు ఈ ఆదేశాలను అన్ని పాఠశాలలకు తెలియజేయడంతో పాటు ప్రాజెక్టుల తయారీ పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థుల పేర్లు, ప్రాజెక్టుల వివరాలు, మార్గదర్శక ఉపాధ్యాయుల సమాచారం, ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులను గూగుల్ నమూనా ద్వారా జిల్లా విద్యాశాఖాధికారికి సమర్పించాలని తెలిపారు. వరంగల్ జిల్లాలోని విద్యార్థులు జిల్లా స్థాయి ప్రదర్శనల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డి కోరారు.

అంతర్జాతీయ క్యూఎస్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో ఎస్ఆర్ యూనివర్సిటీకి అరుదైన గుర్తింపు

ఆసియా స్థాయిలో 701-710 ర్యాంక్ బ్యాండ్‌లో తొలిసారిగా స్థానం
భారతదేశంలోని రాష్ట్ర ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో 19వ స్థానం..
తెలుగు రాష్ట్రాల్లో ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో అగ్రస్థానం



వరంగల్, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్)

అంతర్జాతీయ ఉన్నత విద్యారంగంలో వరంగల్‌కు చెందిన ఎస్ఆర్ యూనివర్సిటీ మరో అరుదైన ఘనతను సాధించింది. ప్రతిష్ఠాత్మక క్యూఎస్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్--2027లో తొలిసారిగా స్థానం సంపాదించి అంతర్జాతీయ స్థాయిలో తన ప్రత్యేకతను చాటుకుంది. ఆసియా స్థాయిలో 701--710 ర్యాంక్ బ్యాండ్‌లో చోటు దక్కించుకోవడంతో పాటు భారతదేశంలోని రాష్ట్ర ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో 19వ స్థానాన్ని సాధించింది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో అగ్రస్థానంలో నిలిచి వరంగల్ విద్యారంగానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఛాన్సలర్ ఏ. వరదారెడ్డి మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన క్యూఎస్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో ఎస్ఆర్ యూనివర్సిటీ తొలిసారిగా ప్రవేశించి 701--710 ర్యాంక్ బ్యాండ్‌లో స్థానం సంపాదించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భారతదేశంలోని రాష్ట్ర ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో 19వ స్థానాన్ని సాధించడం, తెలుగు రాష్ట్రాల్లోని ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో అగ్రస్థానంలో నిలవడం యూనివర్సిటీ సాధించిన ముఖ్యమైన విజయమని పేర్కొన్నారు. తొలి ప్రయత్నంలోనే ఆసియా స్థాయిలో ర్యాంకింగ్ పొందిన విశ్వవిద్యాలయాల్లో దాదాపు 60 శాతం సంస్థలను అధిగమించడం యూనివర్సిటీ అంతర్జాతీయ ప్రస్థానంలో ఒక కీలక మైలురాయిగా అభివర్ణించారు. క్యూఎస్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్ అనేవి ఉన్నత విద్యాసంస్థల విద్యా ప్రమాణాలు, పరిశోధనా సామర్థ్యం, అంతర్జాతీయ గుర్తింపును అంచనా వేసే ప్రతిష్ఠాత్మక ర్యాంకింగ్ వ్యవస్థల్లో ఒకటని ఛాన్సలర్ వివరించారు. ఈ ర్యాంకింగ్స్‌లో విద్యా రంగంలో విశ్వవిద్యాలయాల ప్రతిష్ఠ, ఉద్యోగదాతల అభిప్రాయాలు, పరిశోధనల నాణ్యత, అధ్యాపకులు--విద్యార్థుల నిష్పత్తి, అంతర్జాతీయ పరిశోధనా నెట్‌వర్క్‌లు, విదేశీ విద్యాసంస్థలతో భాగస్వామ్యాలు వంటి పలు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని తెలిపారు. ఇలాంటి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ర్యాంకింగ్స్‌లో ఎస్ఆర్ యూనివర్సిటీ తొలి ప్రయత్నంలోనే స్థానం సంపాదించడం తమ విద్యా, పరిశోధనా రంగాల్లో సాధిస్తున్న నిరంతర అభివృద్ధికి నిదర్శనమని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు యూనివర్సిటీ ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలు, పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించేలా విద్యా విధానాలను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి విద్యాసంస్థలతో అనుసంధానం పెంచడం, అంతర్జాతీయ పరిశోధనా అవకాశాలను విస్తరించడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడం ద్వారా ఉన్నత విద్యారంగంలో ప్రత్యేక గుర్తింపు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రపంచ విశ్వవిద్యాలయ ర్యాంకింగ్స్--2027తో పాటు యూఐ గ్రీన్‌మెట్రిక్ ప్రపంచ విశ్వవిద్యాలయ ర్యాంకింగ్స్‌లోనూ ఎస్ఆర్ యూనివర్సిటీ గుర్తింపు పొందడం మరో విశేషమని ఛాన్సలర్ తెలిపారు. విద్యా ప్రమాణాలు, పరిశోధన, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి వంటి విభిన్న రంగాల్లో యూనివర్సిటీ సాధిస్తున్న పురోగతికి ఈ అంతర్జాతీయ గుర్తింపులు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ విజయాల వెనుక యూనివర్సిటీ యాజమాన్యం, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల సమిష్టి కృషి ఉందని అభినందించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ, విద్యా ప్రమాణాలను నిరంతరం మెరుగుపరచడం, పరిశోధనల్లో నాణ్యతను పెంపొందించడం, అంతర్జాతీయ సహకారాలను విస్తరించడం, పరిశ్రమలతో అనుసంధానాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై యూనివర్సిటీ ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. విద్యార్థులకు కేవలం పాఠ్యపుస్తకాల పరిజ్ఞానమే కాకుండా, వాస్తవ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించే నైపుణ్యాలు అందించడమే లక్ష్యంగా విద్యా కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. అంతరశాఖా విద్యా విధానం, అనుభవపూర్వక బోధన, పరిశోధన ఆధారిత నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, విద్యార్థుల ఉపాధి అవకాశాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంతో పాటు ప్రపంచస్థాయి విద్యా వాతావరణాన్ని నిర్మించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. యూనివర్సిటీ నాయకత్వం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల సమష్టి కృషి వల్లే ఈ అంతర్జాతీయ గుర్తింపులు సాధ్యమయ్యాయని అన్నారు. భారతదేశ ఉన్నత విద్యారంగాన్ని అంతర్జాతీయ స్థాయిలో మరింత బలోపేతం చేయడంలో ఎస్ఆర్ యూనివర్సిటీ తనవంతు బాధ్యతను నిర్వహిస్తుందని, ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్య, పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించేందుకు కట్టుబడి ఉన్నామని వైస్ ఛాన్సలర్ స్పష్టం చేశారు. వరంగల్ కేంద్రంగా అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో ముందుకు సాగుతున్న ఎస్ఆర్ యూనివర్సిటీకి లభించిన ఈ గుర్తింపు విద్యార్థులు, అధ్యాపకులు, విద్యావేత్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు తెలంగాణ ఉన్నత విద్యారంగానికి మరింత గుర్తింపు తీసుకువచ్చే విజయంగా నిలిచింది. ఈ విలేకరుల సమావేశంలో యూనివర్సిటీ ఛాన్సలర్ ఏ. వరదారెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.వి. రమణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క కామ్రేడ్ జంపాల చంద్రశేఖర ప్రసాద్

51వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించిన పీడీఎస్‌యూ నాయకులు

వరంగల్, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్)

ప్రగతిశీల ప్రజాస్వామ్య విప్లవ విద్యార్థి ఉద్యమాల నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన కామ్రేడ్ జంపాల చంద్రశేఖర ప్రసాద్ (జేసీఎస్) ఆశయాలు నేటి విద్యార్థి లోకానికి స్ఫూర్తిదాయకమని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ అన్నారు. కామ్రేడ్ జంపాల చంద్రశేఖర ప్రసాద్ 51వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మర్రి మహేష్ మాట్లాడుతూ ప్రగతిశీల భావజాల వ్యాప్తికి, విద్యార్థుల్లో సామాజిక చైతన్యం పెంపొందించేందుకు జంపాల చంద్రశేఖర ప్రసాద్ తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. కామ్రేడ్ జాజిరెడ్డి, కామ్రేడ్ జార్జిరెడ్డి మరణాల అనంతరం ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం నిస్తేజంగా మారుతున్న సమయంలో జంపాల చంద్రశేఖర ప్రసాద్ తిరిగి విద్యార్థులను ప్రగతిశీల ఉద్యమ బాటలో నడిపించేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిగా ఉన్న ఆయన కోదాడ వేదికగా పీడీఎస్‌యూ విద్యార్థి ఉద్యమ నిర్మాణానికి సంబంధించిన ముసాయిదాను రూపొందించారని గుర్తుచేశారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా విద్యార్థి ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడంలో కీలక పాత్ర పోషించారని వివరించారు. కామ్రేడ్ జార్జిరెడ్డి ఆశయాలు, ఆలోచనలను ముందుకు తీసుకెళ్లే క్రమంలో జంపాల చంద్రశేఖర ప్రసాద్ తీవ్ర నిర్బంధాలను ఎదుర్కొన్నారని మహేష్ తెలిపారు. ఎమర్జెన్సీ కాలంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇల్లందు మండలంలోని చీకటిగండ్ల అటవీ ప్రాంతంలో పోలీసులు కాల్చి చంపారని పేర్కొన్నారు. ఆయన మరణించి 51 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తి విద్యార్థి ఉద్యమాల్లో కొనసాగుతున్నాయని అన్నారు. మతతత్వ ఉన్మాదానికి వ్యతిరేకంగా, శాస్త్రీయ దృక్పథం కలిగిన సమాజ నిర్మాణం కోసం, సమానత్వంతో కూడిన సమసమాజ స్థాపన కోసం జంపాల చంద్రశేఖర ప్రసాద్ పోరాటం సాగించారని తెలిపారు. ఆయన కలలుగన్న సమాజం ఏర్పడే వరకు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు, కార్యకర్తలు ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తారని స్పష్టం చేశారు. కామ్రేడ్ జంపాల చంద్రశేఖర ప్రసాద్ ఆశయాలను ఆచరణలో కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని మర్రి మహేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు స్వామి, రవీందర్, సంతోషిని, కార్తీక్, మౌనిక, అంజలి, వంగేటి మోహన్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



సమాచార హక్కు చట్టం అమలులో శాతవాహన విశ్వవిద్యాలయ అధికారుల నిర్లక్ష్యం!

అడిగిన సమాచారానికి సమాధానం కరువు.. అసంపూర్తి వివరాలతో కాలయాపన.. సమాచార కమిషన్ ఆదేశాలనూ పట్టించుకోని వైనం

కరీంనగర్, నవంబర్ 6 (జై భీమ్ న్యూస్)

శాతవాహన విశ్వవిద్యాలయంలో సమాచార హక్కు చట్టం--2005 అమలు తీరు పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. చట్టం ప్రకారం కోరిన సమాచారాన్ని పూర్తిస్థాయిలో అందించకుండా, అసంపూర్తి సమాధానాలతో అధికారులు కాలయాపన చేస్తున్నారని సామాజిక కార్యకర్త అనిల్ కుమార్ ఆరోపించారు. సమాచార కమిషన్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ వాటిని సకాలంలో అమలు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతో పాటు ప్రజలకు పాలనాపరమైన సమాచారాన్ని అందుబాటులోకి తీసుకురావడమే సమాచార హక్కు చట్టం ప్రధాన ఉద్దేశమని అనిల్ కుమార్ పేర్కొన్నారు. అయితే శాతవాహన విశ్వవిద్యాలయంలో ఈ చట్టం అమలు విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుదారులు కోరిన వివరాలను నిర్ణీత గడువులోగా పూర్తిస్థాయిలో అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు. చట్టబద్ధంగా కోరిన సమాచారాన్ని అందించకుండా అసంపూర్తి వివరాలు ఇవ్వడం, పదేపదే కాలయాపన చేయడం, సమాచార కమిషన్ ఆదేశాలను సైతం పట్టించుకోకపోవడం ప్రజాస్వామ్య పారదర్శకతకు విఘాతం కలిగిస్తుందని అన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులే చట్ట నిబంధనలను నిర్లక్ష్యం చేస్తే సామాన్య పౌరులకు న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, ఉన్నత విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి శాతవాహన విశ్వవిద్యాలయంలో సమాచార హక్కు చట్టం అమలు తీరుపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమాచారాన్ని అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల బాధ్యతను నిర్ధారించి, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా సమాచార కమిషన్ జారీ చేసిన ఆదేశాలను తక్షణమే అమలు చేయించి, సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తుదారులు కోరిన పూర్తి వివరాలను ఎలాంటి జాప్యం లేకుండా అందించాలని సామాజిక కార్యకర్త అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు.


TELANGANA INFORMATION COMMISSION
NOTICE
Appeal No. 16989/SIC-VM/2026 Date: 10-09-2026
Ref:-1. 6(1) Application dated 02-05-2026 filed before the PIO
2. 19(1) Application dated 01-06-2026 filed before the FAA
Whereas Sri S.Anil Kumar has filed an Appeal U/s 19(3) of the RTI Act, 2005 before this Commission against the Public Authority and whereas the said appeal is posted for hearing on the following date, time and place.
Date of Hearing & Time: 22nd September, 2026 at 3:00 PM
Place of Hearing: SIC-VM Chamber, Room No. 107
The Complainant and respondents can also avail Virtual Hearing
Details of Virtual/ Online Hearing
Google Meet Link: https://meet.google.com/qfe-duet-rjj
Google Meet Code: qfe-duet-rjj
QR Code
E-mail: sic2pubi@tgsic.telangana.gov.in
For Technical Help: 7780193128
A. The Respondent is hereby directed:
(i) to file action taken (point wise) on (1) application
(ii) to file copies of information furnished to the appellant and proof of dispatch / receipt / acknowledgement by the appellant
(iii) to file point wise counter on the appeal along with enclosed affidavit duly filled in all respects;
(iv) All the above should reach the Commission at least 2 working days prior to the date of hearing by Regd. Post or email address sic2pubi@tgsic.telangana.gov.in
(v) the Respondent shall produce a copy of the RTI Act data for the perusal of State Information Commission.
(vi) If the respondents select virtual mode, they shall show the above mentioned documents during the hearing, if required.
B. The appellant may file affidavits containing the:
(i) points for which information is not furnished; and
(ii). Points for which information furnished is unsatisfactory / incorrect / false giving complete justification in support of his claim.
(iii) All the above should reach the Commission at least 2 working days prior to the date of hearing by Register Post or Email address sic2pubi@tgsic.telangana.gov.in
The appellant and Respondents attending hearing through virtual (Hybrid) mode, shall intimate the Commission two working days in prior to the date of hearing through e-mail. The instructions or steps for attending online hearing are given in Annexure-I of this notice.
All appeals will be decided on the basis of material placed before the Commission and as per the merits of the case.
Given under the seal of the Telangana State Information Commission on this, the 10th day of September, 2026.
// BY ORDER //
Section Head to SIC-VM

వేగవంతంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి





వచ్చే విద్యా సంవత్సరం నుంచే అకడమిక్ బ్లాక్-1లో పూర్తిస్థాయిలో తరగతులు ప్రారంభించాలి: డీజీపీ సీవీ ఆనంద్


హైదరాబాద్, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్)

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, వచ్చే విద్యా సంవత్సరం నాటికి అకడమిక్ బ్లాక్-1లో పూర్తిస్థాయిలో తరగతులు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం మంచిరేవులలోని యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించి, పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు నిర్మాణ పనులకు అనుమతులు మంజూరు చేస్తూ, పెండింగ్‌లో ఉన్న అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. సమీక్షలో విద్యా విభాగం, మౌలిక సదుపాయాలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు, నియామకాలు, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కమిటీల పనితీరును డీజీపీ సమీక్షించారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అవసరాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన తరగతి గదులతోపాటు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని స్పష్టం చేశారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతోపాటు సరైన కెరీర్ మార్గదర్శకత్వం ఎంతో అవసరమని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ముఖ్యంగా మాదకద్రవ్యాల ప్రభావం లేని ఆరోగ్యకరమైన వాతావరణంలో విద్యాబోధన అందించడం ఎంతో ప్రాధాన్యత కలిగిన అంశమన్నారు. క్రమశిక్షణ, నాణ్యమైన బోధన, సమర్థవంతమైన మార్గదర్శకత్వం ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించడమే యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పోలీసు కుటుంబాలకు చెందిన పిల్లలతోపాటు సాధారణ పౌరుల పిల్లలకు కూడా అత్యున్నత విద్యా ప్రమాణాలతో విద్యను అందించేలా ఈ పాఠశాలను తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. భవిష్యత్తులో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు మంచి ఆదరణ లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పాఠశాలలో 345 మంది విద్యార్థులు ఆరవ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నట్లు అధికారులు డీజీపీకి వివరించారు. వచ్చే విద్యా సంవత్సరానికి సుమారు 720 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడంతోపాటు, మొత్తం వెయ్యి మంది విద్యార్థులకు అవసరమైన విద్యా సదుపాయాలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని డీజీపీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ సీవీ ఆనంద్‌తోపాటు శాంతిభద్రతల విభాగం డీజీ మహేష్ భగవత్, ఆక్టోపస్ డీజీ అనిల్ కుమార్, ఐజీపీ ఎల్. గజరావు భూపాల్, సిద్ధిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఏజీ అడ్మిన్ రమణ కుమార్, డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, క్రిమ్సన్ సంస్థ సహ వ్యవస్థాపకుడు విశాల్ గోయల్, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రిన్సిపాల్ అనితారెడ్డి, జయకుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మామునూరు విమానాశ్రయాన్ని పరిశీలించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు

విమానాశ్రయంతో ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఊతంలి





వరంగల్, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్):

జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్ గురువారం మామునూరు విమానాశ్రయాన్ని సందర్శించి అభివృద్ధి, భూసేకరణ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామునూరు విమానాశ్రయం వరంగల్ ప్రజల చిరకాల స్వప్నమని, విమానాశ్రయం పునఃప్రారంభమైతే వరంగల్‌తో పాటు పరిసర జిల్లాల రవాణా, పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు.జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద విమానాశ్రయ భూసేకరణ వివరాలను వెల్లడిస్తూ భూములు కోల్పోతున్న వారిలో ఎస్సీలు 55 మంది, ఎస్టీలు ఒకరు, బీసీలు 214 మంది, ఓసీలు 60 మంది ఉన్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి నిఖిత, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, అదనపు కలెక్టర్ ఎల్. కిషోర్ కుమార్, డీఆర్వో విజయలక్ష్మి, విమానాశ్రయ అథారిటీ అధికారి నటరాజ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హన్మకొండ, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్)

హన్మకొండ జిల్లా సుబేదారి ప్రాంతంలోని రెడ్‌క్రాస్ సమీపంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) గోదాంను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం నెలవారీ తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలను భద్రపరిచిన గోదాంకు వేసిన సీల్స్‌ను కలెక్టర్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు, పరిసరాల నిర్వహణ, సీసీటీవీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ఈవీఎంల భద్రతకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, గోదాం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని భద్రతా సిబ్బందికి కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్‌తో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్ ర్యాలీకి గైర్హాజరు..

200 మంది యూత్ కాంగ్రెస్ నేతలపై వేటు!

మేనమామ పెద్దకర్మకు వెళ్లినా సస్పెన్షన్

రోహిత్ రజోరియా ఆవేదన

బార్‌కోడ్, యాప్‌తో హాజరు నమోదు

తెలంగాణలో 14 మందిపై చర్యలు

క్రమశిక్షణ కోసమేనన్న అధ్యక్షుడు

హైదరాబాద్, నవంబర్ 06 (కొత్త స్వరం):

ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న జరిగిన రాహుల్ గాంధీ పాల్గొన్న ఇండియా కూటమి ర్యాలీకి హాజరుకాని సుమారు 200 మంది యూత్ కాంగ్రెస్ సభ్యులను నాయకత్వం సస్పెండ్ చేసింది. మేనమామ మరణానంతర పెద్దకర్మకు హాజరైనందున ర్యాలీకి రాలేకపోయానని, ముందుగానే సమాచారం ఇచ్చినా వివరణ కోరకుండానే తనను సస్పెండ్ చేశారని యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రోహిత్ రజోరియా ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యుల హాజరును బార్‌కోడ్ స్కానర్లు, 'విత్ ఐవైసీ' యాప్ ద్వారా నమోదు చేయగా, సుమారు 15 వేల మంది వచ్చారని నాయకులు చెబుతున్నప్పటికీ 2,831 మంది మాత్రమే డిజిటల్‌గా రిజిస్టర్ అయ్యారు. రాష్ట్రాల వారీగా మధ్యప్రదేశ్‌లో 60, గుజరాత్‌లో 49, పశ్చిమ బెంగాల్‌లో 26, తెలంగాణలో 14, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్‌లలో 13 చొప్పున, హర్యానాలో 10 మందిపై చర్యలు తీసుకున్నారు. ఈ సంఖ్య 500కు చేరవచ్చని అంచనా వేస్తున్నారు. పార్టీలో జవాబుదారీతనం పెంచేందుకే సస్పెన్షన్లు చేపట్టామని యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ సమర్థించుకున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

ఘనంగా ముగిసిన 5వ రాష్ట్ర పోలీస్ క్రీడా పోటీలు

మూడు రోజుల పాటు ఉత్సాహంగా సాగిన క్రీడా సంబరాలు..
1,535 మంది పోలీస్ క్రీడాకారుల భాగస్వామ్యం
పోలీసుల విధి నిర్వహణలో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం ఎంతో ముఖ్యం: మల్టీ జోన్-1 ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి





వరంగల్, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్)

వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించిన 5వ స్టేట్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 గురువారం ఘనంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ యూనిట్లకు చెందిన 1,535 మంది పురుష, మహిళా పోలీస్ క్రీడాకారులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటుకున్నారు. హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియం, స్కిల్ స్టోర్మ్ స్కూల్, కిట్స్ కళాశాల క్రీడా ప్రాంగణం, పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని రాణి రుద్రమదేవి హాలులో వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. ఇందులో వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఖో-ఖో, కబడ్డీ, హాకీ, ఫుట్‌బాల్, సెపక్ తక్రా తదితర క్రీడాంశాల్లో పురుష, మహిళా పోలీస్ క్రీడాకారులు పోటీపడ్డారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్టీ జోన్-1 ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పోలీస్ సిబ్బందికి విధి నిర్వహణలో శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ ఎంతో అవసరమని అన్నారు. ఇలాంటి క్రీడా పోటీలు సిబ్బందిలో క్రీడాస్ఫూర్తి, ఐకమత్యం, పరస్పర సహకారం, జట్టుగా పనిచేసే లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచే పోలీస్ క్రీడాకారులకు వార్షిక ఇంక్రిమెంట్లు కూడా లభిస్తాయని తెలిపారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు, జట్లకు బహుమతులు, ట్రోఫీలను అందజేసి అభినందించారు. మూడు రోజుల పాటు క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీస్ క్రీడాకారులు ఎంతో క్రమశిక్షణతో పోటీల్లో పాల్గొని తమ క్రీడాస్ఫూర్తిని చాటుకున్నారని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజాసేవలోనూ అదే ఉత్సాహం, అంకితభావంతో పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మూడు రోజుల పాటు క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ ముగింపు కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రాయల ప్రభాకర్ రావు, ఇతర అడిషనల్ డీసీపీలు, సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాకతీయ విశ్వవిద్యాలయ పరిశోధకుడు కె. సాయి మనీష్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్)

కాకతీయ విశ్వవిద్యాలయ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగ పరిశోధకుడు కె. సాయి మనీష్‌కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఈ విషయాన్ని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల వెల్లడించారు.“మాగ్నెటిక్ అండ్ మెకానికల్ బిహేవియర్ ఆఫ్ మాగ్నెటోస్ట్రిక్టివ్ ఫె-గా థిన్ ఫిల్మ్స్” అనే అంశంపై డాక్టర్ చాడ రాధిక పర్యవేక్షణలో ఆయన పరిశోధన పూర్తి చేశారు. హనుమకొండకు చెందిన సాయి మనీష్ ప్రస్తుతం కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల (కో-ఎడ్యుకేషన్)లో ఒప్పంద అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఆయనకు డాక్టరేట్ లభించడం పట్ల విశ్వవిద్యాలయ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

యువతలో ఓటు హక్కుపై అవగాహన పెంపొందించాలి





ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ద్వారా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు
రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

హన్మకొండ, నవంబర్ 5(జై భీమ్ న్యూస్)

యువతలో ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు యువతను చైతన్యవంతమైన, బాధ్యతాయుతమైన ఓటర్లుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం యువతలో ఎన్నికలపై అవగాహన పెంపొందించేందుకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా గురువారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల (ఎన్నికల అక్షరాస్యత క్లబ్‌లు) ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పోటీల ద్వారా విద్యార్థులకు ఎన్నికల వ్యవస్థ, ఓటు హక్కు, ప్రజాస్వామ్య విధానాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీలను మూడు దశల్లో నిర్వహించనున్నట్లు వివరించారు. మొదటి దశలో నవంబర్ 2 నుంచి 7వ తేదీ వరకు పాఠశాలలు, కళాశాలల స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. రెండో దశలో నవంబర్ 10 నుంచి 13వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో, మూడో దశలో నవంబర్ 16 నుంచి 18వ తేదీ వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థుల్లో ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించడం, ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, భవిష్యత్తులో బాధ్యతాయుతమైన ఓటర్లుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు వ్యాసరచన, క్విజ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. విద్యాసంస్థల్లోని ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ద్వారా పోటీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు, విద్యాసంస్థల యాజమాన్యాలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యువతలో ఎన్నికల అక్షరాస్యత పెరిగినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత పటిష్టంగా మారుతుందని, ఎన్నికల ప్రక్రియలో చైతన్యవంతమైన యువత భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డి.ఎస్. వెంకన్న, తహసీల్దార్లు రవీందర్ రెడ్డి, భావ్ సింగ్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రైలులో మరిచిపోయిన మహిళ బ్యాగు సురక్షితంగా అప్పగింత

బంగారు ఆభరణాలు, నగదు సహా విలువైన వస్తువులను తిరిగి అందజేసిన కాజీపేట రైల్వే పోలీసులు

కాజీపేట (జై భీమ్ క్రైమ్ న్యూస్)

రైలులో మహిళా ప్రయాణికురాలు మరిచిపోయిన హ్యాండ్‌బ్యాగును గుర్తించి, అందులో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు, ఇతర విలువైన వస్తువులను సురక్షితంగా తిరిగి అప్పగించి కాజీపేట రైల్వే పోలీసులు తమ నిజాయితీని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడకు చెందిన కృష్ణప్రియ అనే మహిళ విశాఖపట్నం నుంచి విజయవాడకు ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించారు. విజయవాడ రైల్వే స్టేషన్‌లో దిగిన అనంతరం తన హ్యాండ్‌బ్యాగును రైలులోనే మరిచిపోయినట్లు గుర్తించారు. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ బ్యాగులో సుమారు 8 గ్రాముల బరువున్న ఒక జత బంగారు చెవి కమ్మలు (విలువ సుమారు రూ.90 వేలు), రూ.1,100 నగదు, క్రెడిట్ కార్డు, పాన్ కార్డు ఉన్నట్లు తెలిపారు. ఈ విషయం కాజీపేట రైల్వే పోలీసుల దృష్టికి రావడంతో జీఆర్పీ కాజీపేట ఎస్ఐ అభినవ్ వెంటనే స్పందించారు. సదరు రైలు కాజీపేట రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే తన సిబ్బంది వెంకటయ్య, అశోక్, ప్రభాకర్‌లతో కలిసి రైలులో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మహిళ మరిచిపోయిన హ్యాండ్‌బ్యాగును గుర్తించి, అందులోని బంగారు ఆభరణాలు, నగదు, ఇతర వస్తువులను భద్రంగా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బ్యాగును కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి, అక్కడికి చేరుకున్న బాధితురాలు కృష్ణప్రియకు అందులోని వస్తువులన్నింటినీ సరిచూసి సురక్షితంగా అప్పగించారు. ఎంతో ఇష్టపడి కొనుగోలు చేసుకున్న బంగారు ఆభరణాలు పోయాయని తీవ్ర ఆందోళనకు గురైన తనకు, రైల్వే పోలీసులు తక్షణమే స్పందించి విలువైన వస్తువులను తిరిగి అందజేయడంతో కృష్ణప్రియ ఆనందం వ్యక్తం చేశారు. కాజీపేట రైల్వే పోలీసుల చొరవ, నిజాయితీని అభినందిస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రయాణికుల సమస్యలపై తక్షణమే స్పందించి, పోగొట్టుకున్న వస్తువులను తిరిగి అందజేయడంలో చొరవ చూపిన కాజీపేట రైల్వే పోలీసుల సేవలను పలువురు అభినందిస్తున్నారు.



విద్యారంగ సమస్యలను పట్టించుకోని పాలకులు నవంబర్ 25, 26, 27 తేదీల్లో ఎస్ఎఫ్ఐ

హనుమకొండ జిల్లా 4వ మహాసభలులి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

హనుమకొండ, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్):

విద్యారంగ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ విమర్శించారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో హనుమకొండ నగరంలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా 4వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.గురువారం సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రి నియామకం జరగలేదని విమర్శించారు. గురుకుల విద్యార్థులకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఎస్ఎంహెచ్ కళాశాల, హాస్టళ్లకు కూడా సొంత భవనాలు లేకపోవడం సమస్యగా మారిందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా రూ.8,154 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో విద్యార్థులు సర్టిఫికెట్లు పొందేందుకు సొంతంగా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ సమస్యలతో పాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇతర ఇబ్బందులపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.జిల్లా మహాసభలను విజయవంతం చేసేందుకు విద్యార్థులు, యువత, విద్యాభిమానులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, సహాయ కార్యదర్శి బిరెడ్డి జస్వంత్, జిల్లా కమిటీ సభ్యులు చెన్నూరి సాయికుమార్, మాసాని ప్రదీప్, సాల్మన్ రాజ్, నాగరాజ్, అనుపు భాను ప్రసాద్, మణిదీప్, రాజ్ కుమార్, నవీన్ సాయి, రణదీప్ తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ ఉప్పుటేరును యుద్ధప్రాతిపదికన డ్రెడ్జింగ్ చేయాలి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు లేఖ

కాకినాడ, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్):

కాకినాడ నగరానికి వరద ముప్పును నివారించేందుకు ఉప్పుటేరు, కాకినాడ--సామర్లకోట ప్రధాన కాలువలో యుద్ధప్రాతిపదికన పూడికతీత పనులు చేపట్టాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. 15.6 కిలోమీటర్ల పొడవునా ఉన్న ప్రధాన కాలువలో ఆధునిక కట్టర్ సక్షన్ డ్రెడ్జర్లు, యాంఫిబియన్ ఎక్స్‌కవేటర్లతో పూడికతీత చేపట్టాలని కోరారు. గతంలో 30 అడుగుల వెడల్పు, 30 అడుగుల లోతు ఉన్న కాలువ ఆక్రమణలు, చెత్త, వ్యర్థాల దంపింగ్ కారణంగా ప్రస్తుతం 12 అడుగుల వెడల్పు, 4 అడుగుల లోతుకు కుంచించుకుపోయిందని పేర్కొన్నారు. 22 ఏళ్లుగా సరైన నిర్వహణ, పూడికతీత లేకపోవడంతో భారీ వర్షాల సమయంలో వరదనీరు, మురుగునీరు ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఇంద్రపాలెం లాకుల వద్ద నిర్మించిన ప్రైవేటు వంతెనలు, రియల్ ఎస్టేట్ అవసరాల కోసం ఏర్పాటు చేసిన అనధికార వంతెనలు వరద ప్రవాహానికి అడ్డంకులుగా మారుతున్నాయని తెలిపారు. 2005లో అప్పటి ఎమ్మెల్యే ముత్తా గోపాలకృష్ణ చొరవతో రూ. 10 లక్షలు వెచ్చించి కాలువలో గుర్రపుడెక్క, ఇతర వ్యర్థాలను తొలగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాలువల ఆధునీకరణ, పూడికతీత పనులు చేపట్టి నగరాన్ని వరద ముప్పు నుంచి కాపాడాలని కోరారు. వచ్చే జనవరి 26, 2027లోపు పనులు ప్రారంభించకపోతే నగర ప్రజల సంక్షేమం కోసం నిరవధిక నిరాహార దీక్ష చేపడతానని రమణరాజు హెచ్చరించారు.



క్రైస్తవ మహిళలపై దాడి అమానుషం..

రాజ్యాంగ హక్కులపై దాడి
దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
అఖిలభారత దళిత క్రైస్తవుల ఫోరం జాతీయ అధ్యక్షుడు అట్లూరి విజయ్ కుమార్





నరసరావుపేట, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్):

తెలంగాణలో క్రైస్తవ మతప్రచారం చేస్తున్నారనే ఆరోపణలతో ఇద్దరు క్రైస్తవ మహిళలపై దాడికి పాల్పడటాన్ని అఖిలభారత దళిత క్రైస్తవుల ఫోరం జాతీయ అధ్యక్షుడు అట్లూరి విజయ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. మహిళలపై చేయి చేసుకోవడం, బహిరంగంగా అవమానించడం అమానవీయ చర్య అని పేర్కొన్నారు. మతప్రచారంపై అభ్యంతరాలు ఉంటే చట్ట బద్ధంగా ఫిర్యాదు చేయాలే తప్ప, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులకు పాల్పడటం సమర్థనీయం కాదన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. క్రైస్తవులపై దాడులు, బెదిరింపులను అరికట్టి దేశంలో అన్ని మతాల వారికి సమాన గౌరవం, హక్కులు కల్పించాలని కోరారు. మతపరమైన విద్వేష చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.

ఓటర్ల జాబితాలో పేరు లేకున్నా మళ్లీ అవకాశం



అమరావతి, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్):

ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అనంతరం ప్రచురించిన ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు ఫారం-6 ద్వారా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. గతంలో ఓటర్లుగా నమోదై ఉన్నప్పటికీ ప్రస్తుత జాబితాలో పేరు లేకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు ఈ నెల 3న అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఎన్నికల సంఘం లేఖ రాసినట్లు తెలిపింది. ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసినంత మాత్రాన తప్పుడు ప్రకటన ఇచ్చినట్లు కాదని, సెక్షన్ 31 కింద ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోరాదని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొంది. కొత్త ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైన వారు ఫారం-6 దరఖాస్తుపై సందేహాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈసీ ఈ స్పష్టత ఇచ్చింది. అయితే దరఖాస్తుదారులు మరో పార్లమెంటరీ లేదా అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండకూడదని తెలిపింది. ఈ విషయాలను సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ మేడపాటి ఇమ్మానుయేల్ వెల్లడించారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హన్మకొండ, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్)

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో వరంగల్ బస్ స్టేషన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, భద్రకాళి మాడవీధుల అభివృద్ధి పనుల పురోగతిపై కుడా అధికారులతో పాటు సంబంధిత నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా అభివృద్ధి పనుల ప్రస్తుత పరిస్థితి, ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతి, మిగిలిన పనుల వివరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే ఈ కీలకమైన పనులను మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కుడా సీపీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇతర అధికారులు, సంబంధిత ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జయగిరి గ్రామంలో నేడు భూముల ఎంజాయ్‌మెంట్ సర్వే

జి.పి.ఓ. అంబి వనిత

హసన్‌పర్తి, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్)



హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామ పరిధిలోని పలు సర్వే నంబర్లకు సంబంధించిన భూములకు నవంబర్ 6వ తేదీ శుక్రవారం ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించనున్నట్లు జయగిరి గ్రామ పంచాయతీ జి.పి.ఓ. అంబి వనిత తెలిపారు. గ్రామ పరిధిలోని 152, 153, 164, 176, 177, 178, 192, 193, 194 సర్వే నంబర్లలో ఉన్న భూములకు సర్వే చేపట్టనున్న నేపథ్యంలో ఆయా సర్వే నంబర్లకు సంబంధించిన రైతులందరూ తప్పనిసరిగా సర్వే సమయంలో అందుబాటులో ఉండాలని సూచించారు. రైతులు తమ వెంట పట్టా పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకురావాలని, పట్టా పాస్‌బుక్ లేని వారు భూమి కొనుగోలు చేసిన పత్రాలతో పాటు సంబంధిత లింక్ డాక్యుమెంట్లను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని కోరారు. అదేవిధంగా, పేర్కొన్న సర్వే నంబర్లలోని భూముల చుట్టుపక్కల ఉన్న రైతులు కూడా సర్వే సమయంలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. భూములకు సంబంధించిన వివరాల పరిశీలన, సర్వే ప్రక్రియ సజావుగా సాగేందుకు రైతులందరూ అవసరమైన పత్రాలతో సమయానికి హాజరై అధికారులకు సహకరించాలని జి.పి.ఓ. అంబి వనిత కోరారు.

నిరుద్యోగుల ఆవేదన సభ.. ఉద్యోగాల భర్తీకి డిమాండ్

ఎన్నికల హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి
జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి తక్షణమే అమలు చేయాలి



హైదరాబాద్, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్):

రాష్ట్రంలో నిరుద్యోగులను మోసం చేసే విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం విడనాడి, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని నిరుద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల వద్ద నిర్వహించిన నిరుద్యోగుల ఆవేదన సభలో వారు మాట్లాడుతూ నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. జేఎల్, డీఎల్, గ్రూప్-1, 2, 3, 4, మెగా డీఎస్సీ, జీపీఓ, విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులతో పాటు ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నష్టం కలిగించే జీవోలను రద్దు చేయాలని, లేనిపక్షంలో రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ సభలో నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఆర్.ఎల్. మూర్తి, జేఏసీ నాయకురాలు అస్మా, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్, ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు ఉదయ్, డీబీఎస్ఏ రాష్ట్ర నాయకుడు కాసర్ల మధు, నరేష్, జక్కుల వెంకటేష్, మహేష్, అనిల్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజా హక్కుల కోసం నల్ల నర్సింహులు చేసిన పోరాటం మరువలేనిది!

33వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు..
నాటి సాయుధ పోరాట చరిత్రను గుర్తుచేసుకున్న నాయకులు
నేటి యువత నల్ల నర్సింహులు ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి
బీసీ, పద్మశాలి సంఘం నాయకులు



నల్లబెల్లి, నవంబర్ 5, 2026 (జై భీమ్ న్యూస్)

తెలంగాణలో నిజాం పాలన, రజాకార్ల అరాచకాలు, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నల్ల నర్సింహులు ప్రదర్శించిన ధైర్యసాహసాలు, త్యాగాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని బీసీ హక్కుల సాధన సమితి, పద్మశాలి సంఘం నాయకులు కడియాల క్రాంతి కుమార్, బొద్దుల దశరథం, బోగ భద్రయ్య, బొద్దుల నర్సయ్య, క్యాతం మొగిళి అన్నారు. మండల కేంద్రంలోని నల్లబెల్లి బస్టాండ్ ఆవరణలో నల్ల నర్సింహులు 33వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఒకప్పుడు బానిసత్వం, వెట్టిచాకిరీ, భూస్వాముల దోపిడీతో అణచివేతకు గురైన తెలంగాణ సమాజంలో ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో రైతాంగ సాయుధ పోరాటం కీలక పాత్ర పోషించిందన్నారు. ఆ పోరాటాల ఫలితంగానే పేదలకు భూములు దక్కాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లో ఆత్మగౌరవ భావన బలపడిందని పేర్కొన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయుడిగా జనగామ తాలూకాలోని కొడకండ్లలో తన జీవితాన్ని ప్రారంభించిన నల్ల నర్సింహులు, విసునూరు రామచంద్రారెడ్డి దొర అరాచకాలను, భూస్వామ్య దోపిడీని ఎదిరించేందుకు కమ్యూనిస్టు పార్టీలో చేరి సాయుధ దళాల్లో పనిచేశారని గుర్తుచేశారు. ప్రజల హక్కులు, భూమి కోసం సాగిన పోరాటంలో ఆయన కీలకంగా వ్యవహరించారని తెలిపారు. సాయుధ పోరాటం అనంతరం లక్ష్మక్కపేటలో సైన్యం చేతికి చిక్కి పోలీసులకు అప్పగించబడిన నల్ల నర్సింహులుకు స్థానిక కోర్టు ఉరిశిక్ష విధించిందని, అయితే హైకోర్టులో అప్పీలు చేసుకోవడంతో పాటు తన కేసును తానే వాదించి న్యాయపోరాటంలో విజయం సాధించారని నాయకులు వివరించారు. అణచివేతకు తలవంచకుండా ప్రజల హక్కుల కోసం పోరాడిన నల్ల నర్సింహులు జీవితం, ఆయన పోరాట పటిమ, ధైర్యం నేటి తరానికి ఆదర్శంగా నిలవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పల్లికొండ రవి, వైనాల వీరాస్వామి, ఆకుల సాంబరావు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
సామాన్యుడి ఆయుధంగా

రాహుల్ ర్యాలీకి గైర్హాజరు..

200 మంది యూత్ కాంగ్రెస్ నేతలపై వేటు!
మేనమామ పెద్దకర్మకు వెళ్లినా సస్పెన్షన్
రోహిత్ రజోరియా ఆవేదన.. బార్‌కోడ్, యాప్‌తో హాజరు నమోదు
తెలంగాణలో 14 మందిపై చర్యలు
క్రమశిక్షణ కోసమేనన్న అధ్యక్షుడు

హైదరాబాద్, నవంబర్ 06 (కొత్త స్వరం):

ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబర్ 1న జరిగిన రాహుల్ గాంధీ పాల్గొన్న ఇండియా కూటమి ర్యాలీకి హాజరుకాని సుమారు 200 మంది యూత్ కాంగ్రెస్ సభ్యులను నాయకత్వం సస్పెండ్ చేసింది. మేనమామ మరణానంతర పెద్దకర్మకు హాజరైనందున ర్యాలీకి రాలేకపోయానని, ముందుగానే సమాచారం ఇచ్చినా వివరణ కోరకుండానే తనను సస్పెండ్ చేశారని యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రోహిత్ రజోరియా ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యుల హాజరును బార్‌కోడ్ స్కానర్లు, 'విత్ ఐవైసీ' యాప్ ద్వారా నమోదు చేయగా, సుమారు 15 వేల మంది వచ్చారని నాయకులు చెబుతున్నప్పటికీ 2,831 మంది మాత్రమే డిజిటల్‌గా రిజిస్టర్ అయ్యారు. రాష్ట్రాల వారీగా మధ్యప్రదేశ్‌లో 60, గుజరాత్‌లో 49, పశ్చిమ బెంగాల్‌లో 26, తెలంగాణలో 14, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్‌లలో 13 చొప్పున, హర్యానాలో 10 మందిపై చర్యలు తీసుకున్నారు. ఈ సంఖ్య 500కు చేరవచ్చని అంచనా వేస్తున్నారు. పార్టీలో జవాబుదారీతనం పెంచేందుకే సస్పెన్షన్లు చేపట్టామని యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ సమర్థించుకున్నారు.

ఓ అందాల రాక్షసీ' సినిమాతో సమరానికి సిద్ధం: హీరో, దర్శకుడు షిరాజ్ మెహదీ

సినీ పరిశ్రమలో యుద్ధం ప్రకటించిన షిరాజ్
చిన్న సినిమాల హక్కుల కోసం ఎంతవరకైనా పోరాటం
అవసరమైతే తెలంగాణ బంద్: షిరాజ్ మెహదీ



'ఓ అందాల రాక్షసీ' సినిమా థియేటర్ల సమస్య ఇప్పుడు పోరాటం నుంచి యుద్ధంగా మారిందని ఆ చిత్ర హీరో, దర్శకుడు, నిర్మాత షిరాజ్ మెహదీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ సినిమాకు థియేటర్లు కేటాయించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ, న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఒక సినిమాను చంపడం అంటే అందులో పనిచేసిన వందల మంది జీవితాలను దెబ్బతీయడమేనని వేదన వ్యక్తం చేశారు. ఈ సినిమా ఒక్కరిది కాదని, చిన్న బడ్జెట్ చిత్రాల సమస్యలన్నింటికీ ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. అవసరమైతే వంద ప్రెస్‌మీట్లు, ఇంటర్వ్యూలు, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. పీవీఆర్, ఐనాక్స్, ఏషియన్ ఫిల్మ్స్ సంస్థలకు థియేటర్లు కేటాయించడం లేదంటూ ఇప్పటికే నోటీసులు పంపించామని, ఫిల్మ్ ఛాంబర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఛాంబర్ అధ్యక్షుడు మారడంతో న్యాయపరమైన ప్రక్రియను తిరిగి ప్రారంభించాల్సి వస్తోందన్నారు. సినిమా ఆడియో, ఓటీటీ, శాటిలైట్, డబ్బింగ్, ఓవర్సీస్ హక్కులతో పాటు థియేటర్ల ద్వారా వచ్చే ఆదాయంపై కూడా ఈ పరిణామాలు ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. తెలంగాణలో తెలుగు చిత్ర పరిశ్రమ వ్యవహారాలపై ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఫిల్మ్ ఛాంబర్ ఆధిపత్యం కొనసాగడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. తెలంగాణ ప్రాంతంలో స్థానిక సినీ నిర్మాతలు, దర్శకులు, కళాకారులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో థియేటర్లు మూతపడటం, సినిమా షూటింగ్‌లు నిలిచిపోవడం వంటి పరిణామాలను గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణలో స్థానికులకు అన్యాయం జరగడాన్ని సహించబోమని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూడా పలుమార్లు తెలియజేశామని, నోటీసులు పంపించామని పేర్కొన్నారు. సమస్య తెలిసినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అవసరమైతే తెలంగాణ వ్యాప్తంగా సినీ పరిశ్రమకు సంబంధించిన వర్గాలను సమీకరించి ఆందోళనలు చేపడతామని, తెలంగాణ బంద్‌కు కూడా వెనుకాడబోమని ప్రకటించారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ వ్యవహారశైలితోపాటు యూట్యూబ్, ఈఎఫ్ఓ మాఫియాపై కూడా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "మా ప్రాణాలైనా పోవాలి.. లేదంటే మా సినిమాకు పరిష్కారమైనా రావాలి. ఇది ఒక్క సినిమా సమస్య కాదు.. తెలంగాణలో చిన్న సినిమాల భవిష్యత్తుకు సంబంధించిన యుద్ధం. మంచిగా చెబితే వినడం లేదు.. త్వరలో మా పోరాటం ఏమిటో చూపిస్తాం. ఇది మా ప్రాంతం.. తెలంగాణ హక్కుల కోసం ఎంతవరకైనా వెళ్తాం" అంటూ షిరాజ్ మెహదీ తీవ్ర హెచ్చరికలు చేశారు. చివరగా 'జై తెలంగాణ.. జై హింద్' నినాదంతో తన ప్రసంగాన్ని ముగించారు.

లగడపాటి శ్రీధర్ లాంచ్ చేసిన "యద్భావం తద్భవతి" చిత్ర టీజర్

రమేష్ జక్కుల దర్శకత్వంలో ప్రసన్న లక్ష్మి భూమిరెడ్డి నిర్మాతగా ప్రసన్న భూమి ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం "యద్భావం తద్భవతి". వరుణ్ సందేశ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో ఇనయ సుల్తానా, రేణు శ్రీ హీరోయిన్స్ గా నటిస్తుండగా సుమన్, నాగ మహేష్, లోహిత్ కుమార్, ధనరాజ్, శ్వేత వర్మ, దయానంద్ రెడ్డి, శ్రీకాంత్ అయ్యంగర్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. శ్యామ్ సినిమాటోగ్రఫీ చేసిన ఈ చిత్రానికి మిహిరామ్ సంగీతం అందించగా ఈ చిత్ర పాటలను కే మ్యూజిక్ ద్వారా చిత్ర బృందం విడుదల చేస్తుంది. విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా "యద్భావం తద్భవతి" చిత్ర టీజర్ ను ప్రముఖ చిత్ర నిర్మాత లగడపాటి శ్రీధర్ గారి చేతుల మీదగా విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా లగడపాటి శ్రీధర్ గారు మాట్లాడుతూ... "అందరికీ నమస్కారం. ఇప్పుడే యద్భావం తద్భవతి చిత్ర టీజర్ చూసాను. ప్రసన్న లక్ష్మి భూమిరెడ్డి గారు నిర్మించిన ఈ చిత్ర టీజర్ చూస్తుంటే చిన్న సినిమా అయినప్పటికీ ప్రొడక్షన్ వాల్యూస్ చాలా బాగున్నట్లు అనిపిస్తుంది. అలాగే ఒక పాట కూడా చూడటం జరిగింది. రమేష్ జక్కుల గారి దర్శకత్వం, మిహిరామ్ గారి సంగీతం చాలా బాగున్నాయి. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ కళ పట్ల ఉన్న అభిమానంతో సినిమా తీయడం చాలా పెద్ద విషయం. ఈ సినిమాలో నటించిన వరుణ్ సందేశ్ అలాగే ఇతర నటీనటులకు చిత్ర బృందానికి నా అభినందనలు. లోహిత్, శ్రీకాంత్ అయ్యంగర్ వంటి ఎంతో సీనియర్ నటులు కీలకపాత్రలు పోషించారు. ఈ సినిమాను ప్రేక్షకులు అందరూ ఆదరించి నిర్మాత మరో సినిమా తీసేలా ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను" అన్నారు. నటీనటులు : వరుణ్ సందేశ్, ఇనయ సుల్తానా, రేణు శ్రీ, సుమన్, నాగ మహేష్, లోహిత్ కుమార్, ధనరాజ్, శ్వేత వర్మ, దయానంద్ రెడ్డి, శ్రీకాంత్ అయ్యంగర్ తదితరులు.

నగరాల్లో ఫ్లెక్సీల గోల.. ప్రజల ప్రాణాలతో చెలగాటం!





ప్రధాన రహదారులు, కూడళ్లను ఆక్రమిస్తున్న భారీ ఫ్లెక్సీలు..
వాహనదారులకు తప్పని ఇబ్బందులు
మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని దుస్థితి
అనుమతులపై అనేక ప్రశ్నలు
రాజకీయ నాయకుల ఫ్లెక్సీలపై నియంత్రణ విధించాలని ప్రజల డిమాండ్

హన్మకొండ, నవంబర్ 5 (జై భీమ్ న్యూస్)

వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హనుమకొండ నగరంలో ఫ్లెక్సీల ఏర్పాటు రోజురోజుకూ సమస్యగా మారుతోంది. రాజకీయ నాయకుల పుట్టినరోజులు, పార్టీ కార్యక్రమాలు, శుభాకాంక్షలు, వివిధ ప్రకటనల పేరుతో నగరంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, రహదారి మూలమలుపుల వద్ద భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలో ఎక్కడ చూసినా ఫ్లెక్సీలే దర్శనమిస్తుండటంతో రహదారులు ఆక్రమణకు గురవుతున్నాయని, వీటి కారణంగా ప్రజల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోందని నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఫాతిమా నగర్ జంక్షన్ నుంచి వడ్డేపల్లికి వెళ్లే ప్రధాన రహదారి మూలమలుపు సమీపంలో ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీ వాహనదారులకు ప్రమాదకరంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. రహదారి మలుపు వద్ద పెద్ద పరిమాణంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడం, వాహనదారుల దృష్టికి అడ్డంకులు ఏర్పడటం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ మార్గంలో నిత్యం ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి రద్దీ ప్రాంతంలో మూలమలుపు వద్ద భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఎదురుగా వచ్చే వాహనాలను ముందుగానే గుర్తించడం కష్టంగా మారడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని చెబుతున్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లు, రహదారుల పక్కన, డివైడర్ల సమీపంలో, మలుపుల వద్ద రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ ప్రచారాలు, వ్యక్తిగత ప్రచారం కంటే ప్రజల ప్రాణాల భద్రతకే ప్రాధాన్యత ఇవ్వాలని, రహదారుల వెంట ప్రమాదకరంగా ఉండే భారీ ఫ్లెక్సీల ఏర్పాటుపై నియంత్రణ విధించాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా, నగరంలో ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలకు సంబంధిత మున్సిపల్ అధికారుల అనుమతులు ఉన్నాయా? అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? ప్రకటనల పేరుతో వసూలు చేస్తున్న రుసుములు మున్సిపల్ ఖజానాకు జమ అవుతున్నాయా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసే విధానం, వాటి గడువు, వసూలు చేస్తున్న ఫీజులు, ప్రభుత్వ ఖాతాల్లో జమవుతున్న ఆదాయ వివరాలను అధికారులు బహిర్గతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను వెంటనే తొలగించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఇటీవల అధికారులకు సూచించినప్పటికీ, నగరంలోని ప్రధాన కూడళ్లు, రహదారి మలుపుల వద్ద భారీ ఫ్లెక్సీలు కొనసాగుతుండటం చర్చనీయాంశంగా మారింది. కమిషనర్ ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా? లేక కాగితాలకే పరిమితమవుతున్నాయా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఫాతిమా నగర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీని ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా పరిశీలించి తక్షణమే తొలగించాలని లేదా వాహన రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగని సురక్షిత ప్రాంతానికి మార్చాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. అంతేకాకుండా నగరంలోని ఇతర ప్రధాన కూడళ్లు, రహదారి మూలమలుపుల వద్ద కూడా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ప్రమాదకరంగా ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని కోరుతున్నారు. ప్రజల ప్రాణాల కంటే ఫ్లెక్సీల ఆర్భాటమే ముఖ్యమా? ప్రమాదం జరిగిన తర్వాత స్పందిస్తారా? ముందస్తు చర్యలు తీసుకునే బాధ్యత అధికారులకు లేదా? అంటూ నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో చర్యలు చేపట్టి నగరవ్యాప్తంగా ఫ్లెక్సీల ఏర్పాటుపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని, అనుమతులు లేని మరియు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఫ్లెక్సీలను తొలగించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని నగరవాసులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.



సమ్మర్ హాలిడేస్" సినిమా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది

- యాక్టర్స్ రోహన్ రాయ్, అరుణ్

కథా బలమున్న చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ గా, డిస్ట్రిబ్యూటర్ గా పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన తన ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై "సమ్మర్ హాలిడేస్" అనే చిల్డ్రన్ మూవీని నిర్మిస్తున్నారు. "సమ్మర్ హాలిడేస్" సినిమాను మన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ నెల 6న "సమ్మర్ హాలిడేస్" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో మూవీ హైలైట్స్ తెలిపారు రోహన్, అరుణ్. అరుణ్ మాట్లాడుతూ– నేను 8 క్లాస్ చదువుతున్నా. నేను నటించే మూవీస్ స్ట్రిక్ట్ అమ్మ వింటుంది. ఈ సినిమాలో ఆర్.వి. అనే రోల్ చేశాను. ఈ పాత్ర చాలా కామ్ గా ఉంటుంది. తనకు లైఫ్ లో ఏ ప్రాబ్లమ్స్ ఉండవు కానీ అతని లైఫ్ లో సంతోషం ఉండదు. అలా కామ్ గా ఉండే అబ్బాయిలో కె.వి.తో పరిచయం అయ్యాక ఎలాంటి మార్పులు వచ్చాయి అనేది సినిమాలో చూస్తారు. మాది వైజాగ్. ప్రతి సమ్మర్ కు అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్తుండేవాడిని. జయసుధ గారి లాంటి పెద్ద నటితో నటించడం గౌరవంగా భావిస్తున్నా. ఆమె నాకు ఎన్నో సజెషన్స్ ఇచ్చేవారు. ఆమెతో కలిసి నటిస్తున్నప్పుడు నిజంగా మా అమ్మమ్మతో ఉన్నట్లే అనిపించేది. ఫ్యూచర్ లో మంచి జాబ్ వస్తే చేస్తా. సినిమాల్లో అవకాశాలు ఉంటే ఇదే కెరీర్ కొనసాగించాలని అనుకుంటున్నా. నేను నటుడిగా స్టేట్, నేషనల్ అవార్డ్స్ పొందానంటే కారణం మా అమ్మ. నేను సినిమాలు చేసే క్రమంలో ఎక్కడైనా నిరాశపడితే అమ్మే ఎంతో ధైర్యం నింపేది. ఆమె మాటలు నాకు ఎంతో స్ఫూర్తినిస్తాయి. ఒక్కోసారి అమ్మకు ఆరోగ్యం బాగా లేకున్నా నాకు తోడుగా ఉండేది. అనారోగ్యంతో ఉన్నా షూటింగ్స్ కోసం హైదరాబాద్ వచ్చేవారు. తనకు బాగా లేదనే విషయం నాకు తెలియకుండా దాచేది. అమ్మ నాకోసం పడిన కష్టం వల్లే ఈ రోజు నేషనల్ అవార్డ్ పొందగలిగాను. నేను షూటింగ్స్ వల్ల 8వ తరగతిలో ఎక్కువగా స్కూల్ కు వెళ్లలేకపోయాను. స్కూల్ సాంగ్ చేసేప్పుడు చాలా ఎంజాయ్ చేశాం. సింజిత్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. క్రష్ సాంగ్ రోహన్ కు ఉంటుంది. రోహన్ మాట్లాడుతూ నేను ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నా. నా దగ్గరకు వచ్చే స్ట్రిక్ట్ నేను, అమ్మ వింటాం. అమ్మ డెసిషన్ తీసుకుంటుంది. నాకు ఏదైనా స్ట్రిక్ట్ బాగా నచ్చితే తప్పకుండా ఆ మూవీ చేస్తానని అమ్మకు చెబుతాను. సమ్మర్ హాలిడేస్ సినిమాలో నా క్యారెక్టర్ పేరు కె. వి. అతనికి లైఫ్ లో ఎన్నో అవమానాలు ఎదురైనా అందరితో నవ్వుతూ మాట్లాడుతుంటాడు. తన కుటుంబం కోసం, అమ్మ కోసం కష్టపడుతుంటాడు. నా క్యారెక్టర్ ఎనర్జిటిక్ గా ఉంటుంది. మాది చీరాల. మేము ఉండేది హైదరాబాద్ లోనే. పండుగల టైమ్ లో సొంతూరుకు వెళ్తుంటా. నా ఫస్ట్ ప్రయారిటీ చదువు. మా ఇంట్లో వాళ్లు కూడా బాగా చదువుకోమని ఎంకరేజ్ చేస్తుంటారు. చదువుకు ప్రాధాన్యత ఇస్తూనే, క్లాస్ లు మిస్ కాకుండా చూసుకుంటూ షూటింగ్స్ ప్లాన్ చేసుకుంటా. పరీక్షల్లో నాకు 80 నుంచి 90 శాతం మార్కులు వస్తుంటాయి. నేను చేసిన చిత్రాల్లో చదువు అబ్బని పాత్రలే ఎక్కువ ఉన్నాయి. 90'బ లో నా క్యారెక్టర్ కు చదువు రాదు. ఈ సినిమాలో స్కూల్ కు వెళ్తాడు కానీ చదువుల మీద శ్రద్ధ ఉండదు. నటుడిగా కెరీర్ చూస్తే వైవిధ్యమైన స్లాంగ్స్ లో నటించే అవకాశాలు వస్తున్నాయి. 90'బ తెలంగాణ యాస అయితే ఈ సినిమాలో గోదావరి స్లాంగ్ లో మాట్లాడుతాను. 90'బ, ప్రీ వెడ్డింగ్ షో, సమ్మర్ హాలిడేస్ ఈ మూడు సినిమాల్లో మంచి ఫన్ అందించే రోల్స్ నాకు దక్కడం సంతోషంగా ఉంది. నాకు కామెడీ కంటే ఎమోషన్ పండించడం ఇష్టం. 90'బలో నేను ఎమోషనల్ సీన్స్ చేసినా వాటిని నా కామెడీ సీన్స్ డామినేట్ చేశాయి. సమ్మర్ హాలిడేస్ లో మాత్రం కామెడీతో పాటు సమానంగా ఎమోషన్ సీన్స్ చేసే అవకాశం దక్కింది. ఇంటర్వెల్, సెకండాఫ్ లో నా క్యారెక్టర్ కు మంచి ఎమోషనల్ సీన్స్ ఉంటాయి. ప్రేక్షకులు కన్నీళ్లు పెట్టుకుంటారు. నాకు పెద్ద సపోర్ట్ అంటే మా అమ్మ. షూటింగ్ టైమ్ లో నాతోనే ఉండి చూసుకునేది. మా డైరెక్టర్ శ్రీకర్ కన్విక్షన్ తో సినిమా చేశారు. ధీరజ్ గారు చాలా ప్యాషనేట్ ప్రొడ్యూసర్.



HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM